నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 17-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:256 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

భూ ఆక్రమణ
నేటి హిరణ్యాక్షుడు
రాక్షస నైజం

అణు ఇంధనం
మళ్లీ మతయుద్ధాలు
ఆర్థిక మాంద్యం

యుద్ధ విరామం
శిథిలాలు శవాలు
కన్నీటి దృశ్యం

తొలి టి గార్డు
ఇంటికి కంటివెల్గు
నాన్న స్మృతులు

బతుకు భారం
దేశాల యుద్ధదాహం
ధరల మోత

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనివాస

దామాషా ప్రకారమే
బీసీల కోటా !
ఎన్నాళ్ళోపిక పడతాం
తప్పదు కొట్లాట !

మైనార్టీ ప్రజలారా
మీకో నమస్కారం !
మెజార్టీ ఉన్నోళ్ళకే
ఇక రాజ్యాధికారం !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

జలాల విషయంలో స్పష్టంగా ఉన్నాం : మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, జులై 16: గోదావరి జలాల విషయంలో తమ ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సందర్భాల్లో స్పష్టం చేసినా ఏదోరకంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం పెద్దపల్లి లో నిర్వహించిన ఇందిరాశక్తి సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటూ ఆంధ్ర ప్రాంతానికి నీళ్లు ఇవ్వాలని ఆలోచన చేసిన కేసీఆర్ ఈ రోజు తమకేమి తెలియనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

నీటి వాటాల విషయంలో రాజీ లేదు..

గోదావరిలో తెలంగాణ హక్కుగా రావాల్సిన ఒక్క నీటి బొట్టును కూడా వదులుకోబోమని, మన వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వంతో అన్ని ప్రయత్నాలు చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నీటి వాటాల విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టును ఎట్టిపరిస్థితిలో అంగీకరించబోయేది లేదన్నారు. తెలంగాణకు దక్కాల్సిన వాటా దక్కిన తర్వాతే మిగతా ప్రాంతానికి అన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం అన్నారు. కాళేశ్వరం సమీపంలోని రైతులకు నీరు ఇవ్వకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని దుయ్యబట్టారు. కూలిపోయిన డ్యామ్ ల గురించి బీఆర్ఎస్ నేతలు ఇవాళ గొప్పగా మాట్లాడుతున్నారని బనకచర్ల విషయంలో ఆనాడు లేని ఆరాటం ఇవాళ వచ్చిందా అని ప్రశ్నించారు.

ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి..

మహిళలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టామని, విద్యార్థులకు యూనిఫాంలు కుట్టే పనులు మహిళా సంఘాలకే అప్పగించామని మంత్ర శ్రీధర్‌బాబు తెలిపారు. మహిళ సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సోలార్ ప్యానల్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి మహిళలకే అప్పగించామన్నారు. పెద్దపల్లి జిల్లాలో మహిళా సంఘాల నుంచి 9 బస్సులను ఆర్టీసీలో అద్దెకు తీసుకున్నామని ఇదే గతంలో అయితే కొందరు పెద్దమనుషుల నుంచే ఆర్టీసీలో బస్సులు అద్దెకు తీసుకునేవారని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఆలోచనలో భాగంగా ఈ ప్రభుత్వం ముందుకు వెళుతున్నదన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమనే లక్ష్యంతో పని చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

విజయవాడలో ఇద్దరు యువకులు దారుణ హత్య

అమరావతి, జులై 16: పట్ట పగలే నగర నడిబొడ్డున నేడు ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు.. రక్తపు మడుగులో పడి ఉన్న రెండు మృతదేహాలు చూసి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.. కత్తితో పొడిచి వారిని హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు.

హత్యకు గురైన వారు క్యాటరింగ్ పని చేసే యువకులుగా తేల్చారు.. అయితే, మృతులు మద్యం మత్తులో ఉన్నట్టు గుర్తించారు పోలీసులు.. మొదట ఎవరు హత్య చేసేశారని విషయంపై క్లారిటీ రాకపోగా.. చివరకు ఈ కేసు కీలక మలుపు తీసుకుంది.. రెండు హత్యలు చేసింది రౌడీషీటర్‌గా గుర్తించారు.. ఇక, హత్యకు గురైన యువకులు విజయ నగరం, విజయవాడకు చెందిన వారిగా చెబుతున్నారు.. మొత్తంగా విజయవాడలో రెండు హత్యలు స్థానిక ంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి.. అయితే, గవర్నర్ పేటలో క్యాటరింగ్ చేసే యువకులు ఓ ఇంట్లో అద్దెకు ఉంటుండగా.. వీరి దగ్గరికి వచ్చిన రౌడీ షీటర్ కిషోర్.. వాగ్వాదానికి దిగాడని.. గొడవ ముద రడంతో కత్తితో ఇద్దరు యువకులను దారుణంగా పొడి చి హత్య చేసినట్టుగా చెబుతున్నారు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన బెజవాడ పోలీసులు.. రౌడీ షీటర్ కిషోర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు..

కేంద్రమంత్రి పాటిల్ సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు భేటీ

10 అంశాలపై చర్చలు

జలవివాదాలపై ఇద్దరు సిఎంలతో పాటిల్ చర్చలు
గోదావరి ,కృష్ణా నీటి కేటాయింపులపై తెలంగాణ పట్టు
మిగుల జలాల అంశాలపై ఎపి ప్రత్యేక దృష్టి
ఢిల్లీలో కొనసాగుతున్న చర్చలు

న్యూఢిల్లీ, జులై 16: ఎపి, తెలంగాణల మధ్య జల వివాదాల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కీలక సమావేశం ప్రారంభమైంది.

ఇందులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు , తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు, ఆయా రాష్ట్రాల నీటి పారుదల మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.. ఈ భేటీ ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న పాత వివాదాల పరిష్కారానికి కేంద్రం తీసుకుంటున్న తాజా ప్రయత్నంగా పరిశీలకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాల కేటాయింపులపై తెలంగాణ ప్రభుత్వం ముఖ్యంగా కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చినట్లు సమాచారం..

విభజన ముందునాటి కేటాయింపులపై అభ్యంతరం చెప్పారు తెలంగాణ అధికారులు. మొత్తం 10 అంశాలనై చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం

రాయలసీమకు జీవనం బనకచర్ల ప్రాజెక్టు

ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి – బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో సముద్రంలో వృథాగా పోతున్న 200 టీఎంసీల గోదావరి వరద నీటిని కర్నూలు జిల్లా బనకచర్ల వరకు తరలించాలన్నది ప్రధాన ఉద్దేశ్యం.

ఈ ప్రాజెక్టుతో 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ఏపీ వాదిస్తోంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి ఇది వెలుగుల బాటగా ఉంటుందని సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారు. కేంద్ర సహకారం అందితే తాము వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధమని ప్రకటించారు. కాగా, ఈ ప్రాజెక్టుకు అనుమతులు లేవని, అసలు ఈ విషయంలో చర్చక్కూడా ఓప్పుకోబోమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.. అయినప్పటికే ఎపి ప్రభుత్వం మిగులు జలాల అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చినట్లు సమాచారం.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం : మంత్రి సీతక్క

పెద్దపల్లి, జులై 16: రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. పెద్దపల్లి పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో బుధవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలు మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు పాఠశాలల్లో విద్యార్థులకు అందించే 60లక్షల యూనిఫారాలు మహిళా సంఘాలకు కుట్టేందుకు ఇచ్చి రూ.30 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. మహిళా క్యాంటీన్లు , ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, మహిళా సంఘాలకు కేటాయించిన బస్సులను ఆర్టీసీకి అద్దె ఇవ్వడం, వడ్డీ లేని రుణాలు వంటి అనేక మహిళా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

మహిళలను పారిశ్రామి కవేత్తలుగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుందని, మహిళల ఆర్థిక అభివృద్ధితో దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. అనంతరం జిల్లాలోని మహిళా సంఘాలకు కేటాయించిన 9 బస్సులను ప్రారంభించారు. జిల్లాలోని మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి రుణాలు, వడ్డీ బకాయిలు చెల్లించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణ రావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

తిరుపతి, జులై 16: తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం సాలకట్ల ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం బంగారు వాకిలి ఎదుట ఉన్న ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయ దేవేరులతో కూడిన మలయప్ప స్వామివిగ్రహాలను గరుత్మంతునికి అభిముఖంగా తీసుకువచ్చి , మరో పీఠంపై స్వామివారి సర్వ సైన్యాధ్యక్షుడు విష్వక్సేనులను దక్షిణాభిముఖంగా కూర్చుండబెట్టారు. అనంతరం ఆనంద నిలయంలోని మూల విరాట్టుకు, బంగారు వాకిలి వద్ద ఆస్థానంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదించారు. అనంతరంపెద్దజీయర్‌స్వామి పెద్ద వెండితట్టులో ఆరు పెద్ద పట్టువస్త్రాలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో, ఇతర ఉన్నతాధికారులు నాలుగు పట్టువస్త్రాలను మూలవిరాట్టుకు అలంకరించారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్ప స్వామి వారికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరించారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తలకు శ్రీవారి పాద వస్త్రంతో 'పరివట్టం' ధరించి స్వామివారి ద్వారా బీయ్యపుదంతో ఆణివార ఆస్థానం ముగిసిందని దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వ ర్యోభవ' అని అర్చకులు తెలిపారు. స్వామివారిని ఆశీర్వదిం చారు. ఆ తరువాత అర్చకులు పెద్ద జీయర్, చిన్న జీయర్ కు, టీటీడీ తరఫున ఈవోకు 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలించారు. 'రూపాయి' హారతి, చందనం, తాం బూలం, తీర్థం, శఠారి మర్యాదలు అనంతరం తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచి

దసరాలోపు ఉప్పల్-నారపల్లి ఫ్లై ఓవర్ ను పూర్తి చేయిస్తా : మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, జులై 16: ఉప్పల్ –నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ ఫ్లై ఓవర్ ను దసరా వరకు పూర్తి చేయిస్తామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం వీర్లాదిగూడ నగర పాలక సంస్థ మేడిపల్లి వద్ద ఎలివేటెడ్ కారిడార్ ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ టెక్నికల్ సమస్యల మూలంగా ఫ్లై ఓవర్ పనులకు జాప్యం జరిగిందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసన్నారు.

ట్రాఫిక్ సమస్య, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఫ్లై ఓవర్ కింద రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. దసరా పండుగ లోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని యుద్ధప్రాతిపధకన బ్రిడ్జ్ పనులు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆహ్వానము

తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు రచన

సృష్టికర్త శతకము

ఆవిష్కరణ మహోత్సవము

తేది: 27 జూలై 2025 ఆదివారం సాయంత్రం గం.6లకు

వేదిక: రామ్మోహన్ గ్రంథాలయం, బందర్ రోడ్, బందరు లాకులు దగ్గర, విజయవాడ

సభాధ్యక్షులు: డా॥ జి.వి.పూర్ణచంద్ శతాధిక గ్రంథకర్త

పుస్తక ఆవిష్కర్త: శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ అధ్యక్షులు, సరసభారతి

గ్రంథపరిచయం: డా॥ గుమ్మా సాంబశివరావు ప్రముఖ రచయిత, సాహితీవిమర్శకులు

ఈ సభకు మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము.

– చలపాక ప్రకాష్ వ్యవస్థాపక కార్యదర్శి

రమ్యభారతి సాహిత్య వేదిక

ఆర్‌టీఏ చెక్‌పోస్ట్, ఆశ్రమ పాఠశాలపై ఏసీబీ దాడులు

–బిక్కనూరు ఆర్‌టీఏ చెక్‌పోస్టుపై తనిఖీలు
–ఏసీబీ అదుపులో ఏఎంవీఐ
–ప్రైవేట్ వ్యక్తులను పట్టుకున్న అధికారులు
–మహబూబాబాద్ ఆశ్రమ పాఠశాలలో ఏసీబీ తనిఖీలు

మహబూబాబాద్, జులై 16:కామారెడ్డి జిల్లా ఆర్‌టీఏ చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అలాగే మహబూబాబాద్ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు.

అంతరాష్ట్ర వాహనాలను తనిఖీ చేయు నిమిత్తం ఇక్కడ ఏర్పాటు చేసిన చెక్ పోస్టు లో ప్రైవేటు వ్యక్తుల దందా కొనసాగుతోందని గత కొంతకాలంగా ఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకుని ఆర్‌టీఏ అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు నిఘా వేసి దాడులు చేశారు.

చెక్‌పోస్టుపై దాడి చేసిన ఏసీబీ అధికారులు తొలుత లారీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులను పట్టుకున్నారు. అనంతరం వారి నుంచి వివరాలు తెలుసుకున్న అధికారులు డ్యూటీ లో ఉన్న అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తో పాటు కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇంకా దాడులు కొనసాగుతున్నాయి. సాయంత్రం వరకూ రికార్డులు పరిశీలించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఆశ్రమ బాలికల పాఠశాలలో ఏసీబీ తనిఖీలు

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో ఏసీబీ అధికారులు అకస్మాకంగా తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో పలు రికార్డులను స్వాధీనపరచుకొని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యగా అనుగుణంగా స్టాక్ రిజిస్టర్ ఇష్యూ, అట్టెన్ అటెండెన్స్, ఆహార పదార్థాల నిల్వలో భారీగా తేడాలున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఫుడ్ ఇన్స్పెక్టర్ , లీగల్ మెట్రాలజీ అధికారుల సహాయంతో విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

కామారెడ్డిలో పాటకు సలాం పాటల రచన వర్క్ షాప్

తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో తేదీ 12- 07 --2025 శనివారం రోజు కర్షక్ బిఈడి కళాశాల లో యువతి యువకులను పాటల వైపు ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రజా యుద్ధ నౌక గద్దర్ యాది లో పాటల రచన వర్క్ షాప్ పాటకు సలాం కార్యక్రమాన్ని నిర్వహించారు

ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాటల నిర్మాణం వర్క్ షాప్ లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం కళాశాలల విద్యార్థులకు యువకులకు పాటల పోటీలను నిర్వహించారు దీనిలో కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని అనేక పాటలతో సభను అలరించారు ప్రముఖ జానపద గాయకులు సంగీత దర్శకులు అష్ట గంగాధర్ పాల్గొని పాటల రచనలో ఉన్న నైపుణ్యాలను సూచనలను అందించి విద్యార్థులను ఎంతో ఉత్సాహపరిచారు ఎన్నో తెలంగాణ పాటలను పాడారు ప్రముఖ గజల్ కవి పాటల రచయిత సూరారం శంకర్ మాట్లాడుతూ జనజీవనానికి పాటే ప్రాణంగా

కవులు రచయితలు కృషి చేస్తున్నారని అన్నారు

తెరవే కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ యువతి యువకులను వారి పాటల ప్రతిభను వెలికి తీసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు అపూర్వ స్పందన లభించిందని అన్నారు కామారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్ రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గద్దర్ యాది లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం బాగుందని తెలంగాణ ప్రాంతంలో అనేక మది గాయకులు ఉన్నారని వారందరూ ఎన్నో పాటలు రాస్తున్నారని మరింతగా రాణించే అవకాశాలను వారికి కల్పించాలని అన్నారు ఈ కార్యక్రమానికి హాజరయ్యి పాటల వర్క్ షాప్ లో పాటల పోటీలో పాల్గొన్న యువకులకు కళాశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు మెమొంటోలు బహుమతులను అందించారు ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు యువకులు కళాకారులు తెలంగాణ రచయితల వేదిక బాధ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చురక

ఉద్యోగాల కల్పన
ఉట్టెక్కి పోయింది
వికాస భారతింకా
వింతగా హాయంది.
నిరుద్యోగ సైన్యమే
నేడింకా దేశమంతా
ఆశలుడిగి అల్లాడే
ఆగక ఆకాశమంత.

–వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం– నేటికి అందం

కదిలిన ఘన యంత్రాంగము?
చెదరిన జల తారు రోడ్ల చిరుగుల నన్నీ
కుదురుగ రిపేరు చేయగ
ముదమును పొందెదరు నగరమున సామాన్యుల్ !!

నగరంలో రోడ్ల రిపేరుకు కదిలిన యంత్రాంగం

–రాధశ్రీ
సెల్:9494481210

ప్రముఖ రంగస్థల నట దర్శక ప్రయోక్త జి.ఎస్.ఎన్.శాస్త్రి ఇకలేరు

ప్రముఖ నట దర్శక ప్రయోక్త, రచయిత, పూర్వ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.యస్.యన్. శాస్త్రి గారు ఇకలేరు. వారి వయసు 91. గత కొంతకాలంగా వృద్ధాప్య అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. సోమవారం రాత్రి పది గంటలకు ఇంట్లోనే చనిపోయినట్లు సమాచారం.

గరికపాటి సుబ్బ నరసింహ శాస్త్రి పద్య నాటక బ్రహ్మగా గుర్తింపు పొందారు. గొప్ప సంస్కృత పండితులు! ఈలపాట రఘురామయ్య, పీసపాటి, బందా లాంటి మహా మహులతో కలసి పని చేశారు. వారికి రంగస్థల కిటుకులు నేర్పించారు. గుమ్మడి గోపాలకృష్ణ లాంటి ఎందరో పద్య నాటక కళాకారులను తీర్చిదిద్దారు. సాంస్కృతిక శాఖ తొలి డైరెక్టర్ జె.వి.సోమయాజులు కోరిక మేరకు పిఎస్ఆర్ అప్పారావు దగ్గర చేరి ఎన్నో ప్రయోగాలు చేశారు. వారు రచించిన అభినయ కౌముది తెలుగు విశ్వావిద్యాలయం డిప్లొమా విద్యార్థులకు సిలబస్ గా వుంది. డి.యస్.దీక్షిత్ నట శిక్షణ శిబిరంలోనూ కీలకంగా వ్యవహరించారు.

ఆయన రచించిన అభినయ సంగ్రహం ఒక చరిత్ర సృష్టించింది.



శ్రీకృష్ణ రాయబారం, సత్య హరిశ్చంద్ర, గయో పాఖ్యానం, చింతామణి తదితర నాటకాల్లోని పాత్రలను విశ్లేషిస్తూ రచించిన ఈ గ్రంథం పద్య నాటక కళాకారులకు ఒక నిఘంటువు లాంటిదని చెప్పవచ్చు! శ్రీకృష్ణుడు, బిల్వ మంగళుడు, అర్జునుడు, ధర్మరాజు లాంటి అనేక పాత్రలు పోషించి మెప్పించారు. పద్యం రాగయుక్తంగా ఎలా పాడాలి. ఎంత మేరకు రాగం తీస్తే జనాదరణ లభిస్తుంది. అలంకరణ శాస్త్రం, అభినయానికి సంబంధించిన అన్ని విశేషాలతో రూపొందించిన పుస్తకం ఒక ప్రామాణిక గ్రంథాన్ని తితిదే సౌజన్యంతో ప్రచురించారు.

1993లో తెలుగు విశ్వావిద్యాలయం పద్య నాటక పోటీలు నిర్వహించినప్పుడు 40 మంది కళాకారులతో వర్క్ షాప్ నిర్వహించి పద్య నాటక కళాకారులూగా తీర్చిదిద్దిన ఘనత శాస్త్రి గారిది! తెలుగు విశ్వ విద్యాలయంలో కొంత కాలం థియేటర్ విభాగంలో అధ్యాపకులుగా సేవలు అందించారు. ఇటీవల కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కళా విపంచి సంస్థలు వారికి సత్కళా భారతి జీవన సాఫల్య పురస్కారం, రంగస్థల గురుబ్రహ్మ పురస్కారం అందించే ప్రయత్నం చేసినా ఆయన రవీంద్రభారతికి రాలేకపోయారు! గతంలో ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం, తెలుగు విశ్వ విద్యాలయం ప్రతిభ పురస్కారం, పలుసంస్థల వందలాది పురస్కారాలు అందుకున్నారు! నంది నాటకాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. పలు మార్లు జ్యూరీ గా పని చేశారు. రేడియో నాటకాలు, దూరదర్శన్ లోనూ ఎన్నో ప్రయోగాలు చేశారు. పద్య నాటక రంగం ఒక గొప్ప రంగస్థల దిగ్గజాన్ని కోల్పోయింది. వారి సేవలు అజరామరం. కన్నీటి నివాళులు.

– డా. మహ్మద్ రఫీ

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

అడవి శోకం

మొలకల వానలో
ముద్ద ముద్దైన బడి పిల్లల్ని చూస్తుంటే
బాధనిపిస్తున్నది
కొంచెం కోపమూ ఉప్పొంగుతున్నది.
మొక్కలను పానపానంగా
లాలపోసి పెంచిన
లేత మందారాల చిట్టి చేతులు
రంపపు కోతలకు భీతిల్లుతున్నై
తరలిపోతున్న
తరువుల శవాలని చూసి
దుఃఖపు కండ్లని మూసుకుంటున్నయి
లేత పుస్తకాల రంగుల కలలు
కొట్టివేతలు తీసివేతలు
అమ్మివేతల పాలైతున్నై.
అందరూ సత్యవ్రత శాకాహారులే
రొయ్యల ముల్లెకు కాళ్ళు ఎట్లొచ్చాయని
హరిత వన దర్యాప్తు సంస్థ
చెమటలు కక్కుతున్నది.
కండ్ల ముందరి దౌర్జన్యానికి
బేడీలు వేసే దమ్ములేక
గారడీ కతలు పేనుతున్నది.
అడవి అడవి దగ్గరే
అడవి మూలాలు అక్కడే నిక్షేపమైతే
అక్సిజెన్ రెండింటికే కాదు
మూడు ఊపిరి సంచులకూ అందుతుంది
ఒక్క భూమే కాదు, ఆకాశమూ
హరితానంద లోకమవుతుంది.
ఇపుడు అడవి రూపం మారింది
చిరునామా గల్లంతైంది
అడవి కూనలు నగరాలలలో
పాలరాతి మేడల బోనుల్లో
పెనుగులాడుతున్నయి.
ఇపుడు అడవి అంటే
రోడ్డుకిరువైపులా మైనింగ్ మాఫీయాలు
కలప స్మగ్లర్లకు సెంట్రీ కాస్తున్నది.
నగరంలోకి పులి వచ్చిందని
పట్టపగలే లేడికూనలకు
థర్డడిగ్రీ సన్మానం సుజలాం సుఫలాం
మలయజ శీతలామ్ రోజూ గొంతులో
సుళ్ళు తిరిగీ తిరిగి మూగబోయింది.
అడవి అడవి తీరే
మనిషి మనిషి తీరే ఉండే
సమాంతర సమాజం కోసం
సున్నితపు త్రాసులో
ఊయలూగుతున్నది.

-డా. ఉదారి నారాయణ,
9441413666.

పంచారామం

అందరి అభిప్రాయమే
అంతిమమనుకోకు
అంతరాత్మ ప్రబోధాన్ని
అలక్ష్యం చేయకు.

గుచ్చుకునేలా
మాట్లాడకు
నొచ్చుకునేలా
చేయకు.

భయానికి
బందీగా మారకు
మెదడుకు
మొద్దుబారనీయకు

ద్రౌపది వస్త్రాపహరణ వేళ
భీష్ముడి మౌనం
అవసానదశలో
అంపశయ్యపై ప్రాయశ్చిత్తం

కళ్ళను
కాపాడుకో
కాళ్ళను
వాడుకో

మైనర్
ఎరేజర్
మేజర్
రేజర్

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

అత్తా-కోడళ్ల బంధం

తరతరాల చరిత్ర
అత్తా-కోడళ్ళ బంధానికి
ఆధిపత్యంతో కాక
అభిమానంతో అక్కున చేర్చుకుంటే
ముందుకెళ్తుంది
ముచ్చటైన బంధంగా
కోడలు ప్రవేశంతో ప్రారంభం
ప్రతి కుటుంబానికొక అద్భుత పర్వంగా
ఓ సరికొత్త అధ్యాయం
నిత్యం శ్రుతులను సవరించుకుంటూ
పాడుకునే సరిగమల పాట
అత్తగారి పరవశం
కోడలికి గౌరవం, ఆశీర్వాదం
హృదయ ప్రతిస్పందనలే
పెదవుల పలుకులు కావాలి
పరస్పర గౌరవమే
బంగారు బంధానికి పునాది కావాలి
ఆ బంధం చిరకాల పటిష్టతకు
ప్రేమే మూలం కావాలి
తేడాలు దొర్లిన చోట
సవ్వలే సమాధానం కావాలి
పాత తరం ప్రతినిధిగా
ఇంటి ఆచారాలకు సంస్కృతులకు
కాపలాదారు అత్తగారు
కొత్త బంధం పాతబడే దాక
ఎలాంటి విభేదాలు తలెత్తినా
సర్దుకుని వెళ్లే సంస్కారం అలవరచుకోవాలి
తప్పును ఎత్తిచూపడం కాదు
తక్షణ పరిష్కారం కీలకం
తరాల వ్యత్యాసంతో
ఉత్పన్నమయ్యేవి అపార్థాలే కానీ
వ్యక్తిత్వ పోరుకు తావులేదు
వయసును గౌరవిస్తూ
అనుభవానికి పెద్దపీట వేయాలి
ఆప్యాయతతో అక్కున చేర్చుకునే వృక్షం
అత్తగారైతే
అనురాగం పరిమళించే పుష్పం
కోడలు కాదా?
ఆ ఇరువురి నడుమ
పరస్పర అవగాహన మేళవిస్తే
ఎన్ని ముళ్లున్నా
పరిమళాన్ని మాత్రమే వెదజల్లే ఆ ఇల్లే
ఓ గులాబీ తోట కాదా!.

-ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

ఇది విన్నారా!

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

ఇది విన్నారా!
ఆయన అట్లా అట
ఈమె ఇట్లా అట
అని గట్లు గట్లు తిరుగుతూ
జట్లు జట్లు మారుతూ
గుట్టు బట్టబయలు చేస్తావు.
వారిది వీరికి చెప్పి
వీరిది వారికి చెప్పి
వారిరువురి వైరానికి
వారధివవుతావు
వారికి వీరికి విరోధం
నీకొక మంచి వినోదం.
కనపడ్డ ప్రతి మనిషిపై
కథలు అల్లుతావు
కల్మషంతో కల్పనలతో
కాలకూటం చిమ్ముతావు
నువ్వు కూడా అంతేనని
అంతకంటే ఎక్కువేనని
నీ మాటలు వినేవారే
నువ్వు లేని సమయంలో
గుసగుసగా గొనుగుతారు
నిర్లక్ష్యం చేసిన నీ ఇంటి కథ
నీ మాట కంటే వేగంగా
బయటికి పరుగు తీస్తుంది
మంచితనం అన్నదే లేని
నీ కథలలోని పాత్రల మధ్య
నిన్ను కూడా ఒక పెద్ద విలన్ లాగా
ఈ లోకం ముందు నిలబెడుతుంది.
ఈ సత్యం నీకు తెలిసేది ఎప్పుడు?
కృషితో బాగుపడడం చేతకాక
తప్పు చేయాలని ఉన్నా
పరువుకు భయపడి అది కూడా చేయలేక
ఇతరులపై ఈర్ష్య పెంచుకొని
రెంటికి చెడ్డ రేవడిలా
ఎన్నాళ్ళని మిగిలిపోతావు?
తప్పును ఖండించు కానీ కల్పించకు.
డబ్బు లేకపోతే అప్పు చేయవచ్చు
లేదా దానంగా పొందవచ్చు
కానీ గడిచిన కాలాన్ని నశించిన
జవసత్వాలను
ఏ బ్యాంకు అప్పుగా ఇస్తుంది
ఏ దాత దానం చేస్తాడు?.
ప్రతి క్షణాన్ని ఒక రూపాయి కాసులా
ప్రతి మాటను ఒక బంగారు నాణెములా
జాగ్రత్తగా ఖర్చు పెట్టు
అనుబంధాల సిరులు
ఆనందాల నిధులు
అన్నీ నీకే సొంతం అవుతాయి.
అప్పుడు నీ గురించి గుసగుసగా కాదు
లోకమంతా వినిపించేలాగా
గొప్పగా మాట్లాడుకుంటారు
నీ దక్షతకు అక్షతలు చల్లుతారు.

-ఆదిత్య కైరం కొండ
8790771348

కల్తీ కల్లు కాలకూట విషమాయె

కల్తీ కల్లు పేదలకు కాలకూట విషమాయే!!
సేద దీరె బ్రతుకులకు శాశ్వత నిద్రలాయే!!
దుకాణదారుల స్వార్థం పేదలకు
మరణ శాసనమాయే!!
నగరంలోని పేదల బతుకులు
కల్లుతో ఆవిరయిపోయే!!
నిషేదిత డ్రగ్స్ కల్లులో ప్రత్యక్షమాయే!!
అధికారుల మొద్దునిద్ర పేదలకు శాపమాయె!!
చారాణా కల్లుకు బారాణా కల్తీ ఆయే!!
అధికారులకు తెలిసినా అమ్మమ్మాలకు లొంగిపోయే!!
చేతులు కాలినాక ఆకులతో తుడిచేసినట్లు!!
విచారణ పేరుతొ చేతులు దులిపేసినట్లు!!
చెట్లు లేని నగరంలో కల్లు దుకాణాల అనుమతులేంది!!
తీరా విషాదం జరిగినాక పరామర్శలేంది!!
సంఘటనలెన్ని జరిగినా ఉలుకు లేదు విచారణాలెన్నైనా పలుకులేదు!!
రిపోర్టులన్నీ కాగితాలకే పరిమితం
పేదల బతుకులు మాత్రం యథాతథం!!
సంఘటన సమయంలో హడావుడి
ఆనక కరి మింగిన వెలగపండు లేండి!!
ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి కనుమరుగయ్యే వాగాటి !!
సమస్య శాశ్వత పరిష్కారానికి లేదేంటి ఆలోచనా ధోరణి!!
ఇకనైనా కల్తీ కల్లు నివారణకు పూనుకొని
పేదలు ఇంకా కాటుకు బలి కాకుండా చూడాలి!!

-విఠల్ మల్లేశం పెద్దిగారి
9440686473

నేస్తం

గాజుబుడ్డిలో అమర్చిన.
వెదురు తృణం గుచ్చాన్ని.
కానుకగ వారి హస్తాల్లోంచి.
నాదోసిట్లో జారవిడుస్తూ.
పచ్చ పచ్చగ ఆకుపచ్చగ.
మన స్నేహ బంధం
పరిఢవిల్లాలని అందించి.
ఆశించే అరుదైన నేస్తం.
ప్రేక్షక పాత్రలోని కనులకు
అది వెదురు తృణగుచ్చమే.
నాకది నిరంతరం పర్యావరణ
సమతుల్యాన్ని ఆవిష్కరించే.
నేస్తగుచ్చమే.
విభిన్న రంగు రాళ్లతో పొదిగిన
సోయగాలను లోకం నేత్రాలు.
ఆనందించి ఆరగిస్తవి.
నా మనోనేత్రంతో.
దర్శించినప్పుడల్లా.
హితుడిమోము సాక్షాత్కారమై.
చిరునవ్వుతో హృదయాన్ని.
తట్టి పలకరిస్తవి.
వెదురు వేర్ల గొంతులను తడిపే.
కాసింత జలం మౌనంగానే.
ఆకలి తీర్చుతూ.
గనుపు గనుపు ఎదుగుదలకు.
ఆకులను చిగురింప చేసినట్టే.
నా స్థితిని తట్టి మెట్టు మెట్టు.
ఎక్కించటానికి ప్రణాళికలను.
రచిస్తూనే ఉంటది నా నేస్తం.
హరిత వర్ణపు సొగసులు.
కంటిపాపలను ముద్దాడినట్టే.
ఆత్మీయ అనురాగపు
చెలిమిని పంచుతు.
నీ నీడగ నేనున్నానంటూ.
భుజముతట్టే మిత్ర బంధం.

-యరకల యాదయ్య.
9866468979.

విశ్వ బలున్ని !

విలువల పాఠశాల ఒడిలో
బుద్ధిగా కూర్చున్నాను ఒకప్పుడు
విశాల సమాజ మైదానంలో
బాధ్యతల బ్రతుకు నేర్చుకుంటున్నానిప్పుడు!.
పల్లెల్లో కూడా పాలిచ్చే గేదె పాల పొంగుల
పొదుగులు పితుకుట కనబడుటలేదు
పల్లె పట్నం వీధి వీధి కిరాణ కొట్టుల
పొద్దుపొడిచే పాలప్యాకెట్లు కనిపిస్తున్నాయి!.
వాక్ స్వాతంత్ర్యం ఉన్నదని
వాదిస్తున్నారు ఇష్టం వచ్చినట్లు
వాదించని వాని
వాక్ స్వాతంత్ర్యం హరించేటట్లు!.
యుద్ధం అంటే ఎదురుగా నిలబడి
విల్లంబులు
విసురుకోవడం అనుకున్నారు
యుద్ధం అంటే ఎక్కడో ఉండి
విధ్వంసకర
బాంబులు వేయడం అనుకుంటున్నారు!.
అప్పుడు హస్తంలో అంజనం
చూసిన వాళ్లను చూసాము
ఇప్పుడు సెల్ ఫోన్ హస్త భూషణం
చూపిస్తున్న సమస్తం చూస్తున్నాము!.
అలల ఒడ్డున ఇసుక రేణువుల్లో
ఆడుకునే నేస్తాలను ఏరుకున్న బాలున్ని
అందని అందమైన ఆకాశ వీధుల్లో
ఆ చందమామతో ముచ్చటిస్తున్న
విశ్వ బలున్ని ఇప్పుడు !

-పట్లాళ్ళ బక్కారెడ్డి
9705315250

తెలుగు రాష్ట్రద్వయం

పక్క రాష్ట్రమెల్లి పదియేడులునుదాటె
దుఃఖమనెది లేక సుఖము తోడ
మోదిపుణ్యమనుట మోపెడంతయునిజం
కనుము వినుముదారి కందుకూరి
తేనెలూరు గడ్డ తెలగాణ జనులది
తేటతెల్లమవునుతెలుసుకుంటె
తేజమైనతీరు తెలగాణజాగీరు
కనుము వినుముదారి కందుకూరి

-కందుకూరి శ్రీరాములు
సీనియర్ లెక్చరర్, తపస్య డిగ్రీ కాలేజ్ సికింద్రాబాద్

ఆటో డ్రైవర్ ఖాలిద్ కలం నుండి జాలువారిన కవిత్వం!

మానవత్వం.. సమానత్వం.. దేశభక్తి వంటి సుగుణాలను ఆవిష్కరిస్తూ.. **"మన మంతా ఒక్కటే"** అని నినదిస్తూ.. ఓ కవితా సంపు టిని సాహితీ లోకానికి అందజేసిన మహ్మద్ ఖాలిద్ వృత్తిరీత్యా ఓ ఆటో డ్రైవర్.. కానీ రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మల చుకుని ముందుకు సాగడం ముదావహం..

మాతృభాష ఉర్దూ అయిన ప్పటికీ.. పదో తరగతి వరకే చదువుకున్న ప్పటికీ.. తెలుగు భాష పట్ల మక్కువ చూపుతూ.. అందరు ముక్కున వేలేసు కునే విధంగా.. ఖాలిద్ జాతీయ భావాలతో తమ కవిత్వాన్ని పండిం చడం అభినందనీ యం.. కరీంనగర్‌కు చెందిన ఖాలిద్.. వివిధ సాహిత్య సభలకు హాజరై..సాహిత్యం పట్ల ఆసక్తితో కవిత్వం రాయ డం పట్ల అను రక్తిని పెంచుకు న్నారు. కవి సమ్మేళ నంలో తరచుగా పాల్గొని మంచి మంచి కవితల్ని గానం చేసి అందరి దృష్టినాకర్షించడం మెచ్చుకోదగింది. తాను రాసిన కవితల్ని ఏర్పి కూర్చి "మన మంతా ఒక్కటే" అన్న పేరుతో ఓ కవితా సంపుటిని ప్రకటిం చారు.

మనం భారతీయులం ఏ ప్రాంతంలో ఉన్నా మన మంతా ఒక్కటే.. అంటూ మానవీయ పరిమళాలను గుబాళిం పజేస్తూ.. ఈ కవితా సంపుటి నిండా దేశభక్తి, జాతీయ సమైక్యత, వంటి అంశాలను సాధికారికంగా ప్రకటిం చడం ప్రశంస నీయం. "మనమంతా ఒక్కటే" కవితా సంపుటిలో 66 కవితలున్నాయి. కవితా వస్తువులన్నీ విభిన్నమైనవి. అభివ్యక్తి, శిల్పం.. కవిత్వ కనీస ప్రమాణాలు పాటించే విషయంలో కవిగా ఖాలిద్ మరింత తెలుసుకో వాల్సి ఉన్నప్పటికీ.. తమ అంతరం గంలో వస్తువు పరంగా కదలాడే భా వాలను అక్షరాల్లో నిక్షిప్తం చేయాలన్న ఆయన ఆరాటాన్ని అందరం అభినం దించి తీరుతాం.. ఇందలి కవిత్వం లో ఆయన ఉత్తమ వ్యక్తిత్వాన్ని, సా మాజిక చింతనను.. దేశభక్తి సంబంధ అంశాలను అడుగడుగునా చూస్తాం..

"మన భారత దేశం" కవితలో కుల మతాల భేదాలను విడనాడి.. సమ సమాజ స్థాపనకు కదులుదామని పిలుపునిచ్చారు. నవ భారతాన్ని నిర్మిస్తూ.. అభివృద్ధి ఫలాలు సామాన్యుని చెంతకు చేరేలా కృషి చేద్దామని ఆకాంక్షించారు. ఆకాశంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడినట్లు.. ప్రతి భారతీయుని మోముల్లో ఆనందాలు వెల్లి విరిసేలా చూద్దామని చెప్పడం బాగుంది.

"దేశం కోసం!" కవితలో రాజ్యాలు మారినా.. రాజకీయాలు మారినా.. దేశ గౌరవాన్ని విశ్వ వ్యాప్తం చేయాలని కోరారు. సైనికుని త్యాగం దేశానికి గౌరవ ఆభరణమనీ.. ప్రతి పౌరుడు దేశానికి వెలుగు పంచే దీపం అవ్వాలంటూ "వందనం" కవితను రూపుదిద్దారు.

ప్రతులకు:
మహ్మద్ ఖాలీద్
ఇ.నెం.1-2-66
శాహబ్ వీధి
కరీంనగర్-505 001
సెల్: 96181 75421

"మనిషి మేలుకో" కవితలో కులమతాల పేరుతో కొట్లాటలు వద్దని.. ఎవరి భావాలు వారివి.. విద్వేసాలు.. విధ్వంసాలు ఎందుకని? ప్రశ్నించారు. ఐకమత్యమే మన బలమని గుర్తెరిగి మనం ముందుకు సాగాలని మరో కవిత ద్వారా సూచించారు. ఓటు హక్కు ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూ.. ఒకటి రెండు కవితలకు ఈ సంపుటి యందు చోటు కల్పించారు. ఓటు హక్కుతో.. దేశాన్ని ప్రగతి పథంవైపుకు నడిపించే నాయకులను ఎన్నుకోవాలని సూచిం చారు.

కవి ఖాలిద్ **"శ్రామికులు"** కవితలో శ్రమైక సౌందర్యాన్ని ఆవిష్కరించారు. శ్రామికులం మేము.. నిజాయితీ మా బలమనీ.. శ్రమైక సౌందర్యమే మా ఆభరణ మని కొనసాగిం చిన తీరు బాగుంది. స్వేదాన్ని చిం దించి.. సంపాదించిన దానితో తృప్తిగా బతుకుతాం.. కష్టం వస్తే ఒకరికొకరం కన్నీళ్లను పంచుకుటామని చెప్పడం బాగుంది.

"హరిత హారం" కవిత ద్వారా పచ్చదనపు ప్రాముఖ్యాన్ని తెలియజెప్పారు. **"ప్రకృతి"** కవిత ద్వారా పచ్చని ప్రకృతిని సంరక్షించే బాధ్యత మనదేనని గుర్తు చేశారు.

కరోనా కాలంలో వలస జీవుల వెతలకు అద్దం పడుతూ "వలస జీవులకు దారేదు?" కవితను రాశారు. ఏ ప్రాంత ప్రజలైనా.. అందరూ మానవులేనన్న ఆలోచనతో.. అందరి పట్ల మానవత్వాన్ని ప్రదర్శిస్తూ ఆదుకోవాలని ఆకాంక్షించారు.

కవులు, రచయితల కర్తవ్యాలను గుర్తు చేస్తూ.. రాసిన ఒకటి రెండు సంపుటిలో మనకు దర్శనమిస్తాయి.

పేరు ప్రతిష్టల కోసం కాక
ప్రజల పక్షాన నిలిచి
వారి సమస్యల పరిష్కారానికి
ప్రయత్నిద్దాం.. అంటూ **"పోరాటం"** కవితను రాశారు.

కవుల కలం- కళాకారుల గళం. మన సంస్కృతిని విశ్వానికి చాటే విధంగా ఉండాలంటూ **"మన లక్ష్యం"** కవితను రూపుదిద్దారు.

"తెలుగు తేజస్సు" కవితలో.. తొలకరి చినుకులతో తడిసిన మట్టి గంధంలా- తెలుగు మరెంతో పరిమళభరితం అంటూ తెలుగు భాష యొక్క గొప్పదనాన్ని తెలియ జెప్పారు. తెలుగు భాష ఆసరాతోనే మృదు మధుర భావాలను.. మనసు దోచే కావ్యాలను తీర్చిదిద్ది.. హృదయాల్లో ఆనందాల పూలను చల్లి- జ్ఞాన జ్యోతులను వెలిగించగల మంటూ.. తెలుగు భాష యొక్క మాధుర్యాన్ని చాటి చెప్పారు.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సినారెపై కవి ఖాలిద్ తమ గౌరవాన్ని చాటుకుంటూ.. రాసిన కవితలో.. కవితాంతరంగం తెలిసిన మీ కలం తెలుగు సాహిత్యానికి జ్ఞానపీఠాన్ని ప్రసాదించిందని కొనియాడారు. మరో కవిత ద్వారా సినారే అక్షరాలు తెలుగు జాతికే ఆదర్శమని కవి ఖాలిద్ అక్షర నీరాజనాలు సమర్పించారు.

"కృష్ణా పుష్కరాలు" పేరుతో రాసిన కవితలో పన్నెండు ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాల దృశ్యాలను అక్షరాల్లో ఆవిష్కరించారు.

గారడి మాటలు చెప్పే
నాయకులను
నమ్మ వద్దనీ..
నిజమైన ప్రజా ప్రతినిదులకు
ఓటు ద్వారా పట్టం కట్టాలన్న అర్థం ధ్వనించే విధంగా "దేశ భవిష్యతుత్త" కవితను తీర్చిదిద్దారు-

ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ.. అన్నదాతల తలరాతలు మారడం లేదని.. వారి ఆత్మహత్యలు ఆపడంలో పాలకులు శ్రద్ధ చూపాలని ఆకాంక్షిస్తూ మరో కవితను రాశారు.

రంగులు మార్చే రాజకీయాల్లో.. పేదవారి కష్టాలు ఇంకెన్నాళ్లు? అంటూ ప్రశ్నిస్తూ మరో కవితను తీర్చిదిద్దారు.

శిలలకే జీవం పోసే శిల్పకారుడు ధన్యజీవి అని.. అతని ప్రతిభను అభినందిస్తూ.. ఓ కవిత ద్వారా వందనం సమర్పించారు. జీవితమంటే కష్ట సుఖాల సమ్మేళనమనీ.. ఆరు రు చుల పచ్చడి ద్వారా తెలిపే ఉగాది పండుగ గురించి రాసిన కవితలో కొత్త వసంతం నిత్య నూతనమవ్వాలని కాంక్షించారు.

బంగారు తెలంగాణ,తెలంగాణం తదితర కవితల్లో.. దేశానికే మన తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచేలా.. అభివృద్ధిలో అందరం భాగస్వాములమవుదామని పిలుపు నిచ్చారు.

ఇలా ఈ కవితా సంపుటిలో అనేక కవితా పంక్తులు ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి. ఖాలిద్ తెలుగు భాషపై మరింత పట్టు సాధించాల్సి ఉంది. అధ్యయనం ద్వారా కవిత్వ రచనలోని మెలకువలు.. శైలి, అభివ్యక్తి, శిల్పం వంటి అంశాలను తెలుసుకుని, తమ కలానికి పదును పెట్టుకోవాలని కోరుకుందాం.. మున్ముందు కవిత్వాన్ని కవిత్వంలా రాయ డానికి కృషి చేస్తారని ఆశిద్దాం..

- దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

పుస్తక సమీక్షలు

నిజాల నిప్పుకణాల మీద నిటారుగా నిలబడ్డ పి.టి. మాధవ్ నాటికలు"

'నా మీద దూకటానికి వందల పిడుగులు సిద్ధపడినా నాకు భయం వుండదు. కానీ అదే సమయంలో ప్రజల నాడిని నాటకాలుగా మార్చి చేసే ప్రదర్శనలంటే నాకు కంపరం. ఎందుకంటే ఆ నాటకాల నిండా అన్నీ సత్యాలే వుంటాయి. వాస్తవాలు ఫిరంగులై నాకోసమే గురిపెట్టినట్లుగా వుంటుంది. ఎక్కడో నా సింహాసనానికి పునాదులు కదులుతున్న శబ్దం. మేఘాలు ఆకాశంలో కాదు, నాటకంలోని దృశ్యాలలో వుంటాయి. అవి గర్జించిన ప్రతిసారి నా రాచరిక సరాలనిండా భయం రక్తంలా ప్రవహిస్తుంది. ఒక్క ప్రజానాటక ప్రదర్శన చాలు, నేను సృష్టించుకున్న నా వైభవ భూగోళమంతా బీటలుబారి భయంకర విస్ఫోటనాలతో మాడి మసైపోవటటానికి. అందుకే భగవంతుడా! నాటకం అనే పదాన్ని శాశ్వతంగా, చిరునామా దొరకని మారుమూల ప్రదేశాలలో భూస్థాపితం చేసేయ్...' అంటూ గుండెలు బాదుకుంటూ నాటకం అనే పదానికి జీవితాంతం గజబగజా వణికిపోయాడు ఒకప్పటి బ్రిటిషు పాలకుడు 'స్టీపెన్'.

నిజమే. నిజాల నిప్పుకణాలమీద నిటారుగా నిలబడే ఏ నాటకమైనా ఒక కొత్త చరిత్రకు పేజీలను సిద్ధం చేసుకుంటుంది. ప్రజల ఇష్టాలను, అయిష్టాలను, బాధలను, బరువులను, కష్టాలను, నష్టాలను, చట్టాల చట్రంలో నలిగిపోయిన జీవితాలదుఃఖపు ఆనవాళ్లను చాలా స్పష్టంగా అందించే కళారూపాలే ప్రజానాటకాలు. వీటి రచనకు ఒక ప్రయోజనం వుంటుంది. వీటిలో జీవం, జీవనం ఆరోగ్యవంతమైన శ్వాసతో చిరకాలం జనాల్ని పలకరించటానికి అవసరమైన వేదికలు చాలా పతిష్ఠంగా నిర్మించబడుతాయి. మనుషులకు గాలి, నీరు, తిండి ఇవి మాత్రమే చాలదు. మనిషిని నిత్యం చైతన్యపరిచి, నవశకాలను ఆహ్వానించే నాటకరూపాలు కూడా ఎంతో అవసరం. ఆ దాహాన్ని తీర్చటానికి నాటిక / నాటకాలనే గంగా ప్రవాహాలను ఈ నేలనిండా ప్రవహింపజేయటానికి తన చేతిలోని కలాన్ని ఒక తిరుగులేని ఆయుధంగా కాలం ఆకురాయిమీద పదునుపెట్టుకుంటున్న నాటక రచయిత 'పి.టి. మాధవ్. న్యాయవాదిగా వాదనల్లో ఆరితేరిన ఈ ప్రతిభామూర్తి, నాటక / నాటిక రచనల్లో సైతం తన సత్తువను శిఖరాగ్రస్థానానికి చేర్చే ప్రయాణానికి ఏనాడో తన నడకను ధాటిగా ప్రారంభించి, ఆ నడకకు కొలవలేనంత వేగాన్ని నిత్యం ఆయన అందించుకోవడం ఒక విశేషం.మన కళ్లముందు ఇట్టే కనుమరుగయ్యే నాటకాలను కాకుండా, కాలంతోపాటు శాశ్వతంగా నిలిచి, సామాన్యులను సగౌరవంగా నిలబెట్ట గలిగిన నాటక / నాటికలను అందించిన రచయిత, న్యాయవాది పి.టి. మాధవ్. ధర్మానికి గొడుగుపడుతూ, చట్టాలకు అవసరమైన మార్పులను సూచిస్తూ, వాస్తవాల రంగులతో కన్నీటి చిత్రాలను ఆవిష్కరిస్తూ, బాధ్యత మరిచిన మనుషుల మనస్తత్వాల వికారాలను జనంముందు బహిర్గతం చేస్తూ, ఒక రచయితగా తన సామాజిక బాధ్యతను నాణ్యమైన రీతిలో కొనసాగించే క్రమంలో తన కలంనుంచి వెలువడిన 'నిశ్శబ్దమా.... నీ ఖరీదెంత?', 'ఓ కాశీవాసీ రావయ్య', 'నన్నెక్కించండి బోను' 'బోయవాని వేటలో' మరియు 'నల్లకోటు నవ్వింది' నాటికలను ఒక సంపుటిగా ఆయన విడుదల చేయడం నడుస్తున్న చరిత్ర ప్రక్రాలనకు, రేపటి చరిత్ర జాగరూకతకు ఒక దీపపు వెలుగుల్ని అందించినట్లుగా వుంది.

'నిశ్శబ్దమా.... నీ ఖరీదెంత?' నాటికను రాసిన పి.టి. మాధవ్ ఉద్దేశ్యం, ఆలోచన, భావం ఒక్కటే. ఈ దేశంలో తీవ్రవాదులకంటే, భయంకరంగా మోసం చేసే దళారులకంటే, దేశాన్ని తాకట్టుపెట్టే అవినీతి పరులకంటే అతి ప్రమాదకరమైన అంశం ఏమిటంటే... మాట్లాడవలసిన అవసరం వచ్చినప్పుడు నిశ్శబ్దపు నీడలో మేథావులు పాటించే మౌనం. మేథావులు శిలల్లా మారిపోయి, మాటలు మరచిపో యి, మౌనాన్ని ఆశ్రయిస్తే ఏం జరుగుతుందో తెలుసా? నదులు, సముద్రాలు ఎండిపోతే ఏమవుతుంది, మేఘాలన్నీ కలిసి వర్షాన్ని కురిపించకపోతే ఏమవుతుంది, ఆకాశంలో సూర్యుడు మాయమైపోతే ఏమవుతుంది, మన చుట్టూ వున్న గాలిలో ప్రాణవాయువు శాశ్వతంగా సెలవు తీసుకుంటే ఏమవుతుంది, అంతెందుకు మన శరీరంలో నిత్యం ప్రవహించే రక్తం, తన చలనాన్ని వదిలేసి, గడ్డకట్టుకుపోతే ఏమవుతుంది? సరిగ్గా అదే జరుగుతుంది మేథావులు మౌనం పాటిస్తే. ఆ మౌనం ఖరీదు ఒక యుద్ధంలో మరణించిన లక్షమంది సైనికుల ప్రాణాలతో సమానమవుతుంది. ఆ మౌనం, వందలాది, వేలాది సంసారాలు అకారణంగా ఉరికొయ్యలకు వ్రేలాడే దృశ్యాలకు సాక్షి సంతకమవుతుంది. ఆ మౌనం నీడల్లో హత్యలు రోజూ తమ ఖాతాలను తెరుచుకునే ఉత్సవాలకు ఆహ్వానం పలికినట్లవుతుంది. అక్రమసంబంధాలకు అనుకూలంగా వున్న కొన్ని చట్టాలవల్ల నష్టబోయేది కేవలం భార్యా, భర్తలే కాదు, ఒక జాతి సంస్కృతి. ఒక జాతి నాగరికత, ఒక జాతి భవిష్యత్తు...ఇలా ఎన్నో విలువలు తీవ్రంగా నష్టపోతాయి. ఈ ప్రమాదాలను నివారించటానికే, 'మేథావులు మౌనం వీడాలి...' అంటూ ఊరూరా దండోరా వాయిస్తోంది 'నిశ్శబ్దమా... నీ ఖరీదెంత?' నాటిక.



నేనిప్పుడు ఒక స్మశానంలో కాలుతున్న ఒక శవం ముందు నిలబడి మాట్లాడుతున్నాను. అక్కడ కాలుతున్నది మనిషి శవం కాదు. కేవలం స్వార్థం కోసమే బ్రతుకుతున్న మనుషుల చేత దారుణంగా హత్య చేయబడ్డ ఈ లోకంలోని మానవత్వపు ఆఖరి ఆనవాలది. గట్టిగా శబ్దిస్తున్న ధమరకం, దానికితోడు దిక్కులన్నీ మారుమ్రోగిపోయేలా శివ పంచాక్షరీ స్తోత్రం, వీటికి అనుగుణంగా సమాధుల మధ్య శివుడి పాత్ర శివతాండవం చేస్తున్న దృశ్యం... ఇది 'ఓ కాశీవాసి రావయ్య' నాటికలోని ప్రారంభ దృశ్యం. ఈ మొదటి దృశ్యపు అడుగు ఆకాశాన్ని తాకుతుందా అనిపించేలా వుంది. ఇందులోని ఏ పాత్ర కల్పితం కాదు. అన్నీ మన చుట్టూ వున్న సమాజలోనుంచి బయటికి తీసినవే. నిజాయితీకి మారుపేరు సారయ్య, నిప్పులాంటి మనస్తత్వంతో నూకాలు, స్వార్థానికి ప్రతిరూపాలుగా హెడ్డు, రవి, రమ పాత్రలు, ఇక మానవత్వం మూర్తీభవించిన వ్యక్తిగా ఆనందరావు పాత్ర నిలబడుతాయి. 'ఆడపిల్ల పెరిగి తల్లికి స్నేహితురాలు అవుతుందట, అదే మగపిల్లాడు పెరిగి తండ్రికి శత్రువౌతాడట...' ఈ వాస్తవాన్ని నిరూపిస్తూ ఆవిష్కరించబడిన ఈ నాటికలోని కొన్నిసన్నివేశాలు చాలాకాలం మనల్ని వెంటబడి పలకరిస్తూనే వుంటాయి. సంస్కారమన్నది డబ్బు సంపదనతో రాదు. నిర్మలమైన మనిషి హృదయమైదానాల నుంచి అది ఆవిర్భవిస్తుందని నిరూపిస్తూ నడక సాగిన ఈ నాటిక పతాక సన్నివేశంలో తిరిగి శివుడు పాత్ర రుద్ర తాండవం చేస్తూ అక్కడున్న చితాభస్మాన్ని తన వొంటికి విభూతిరేఖల్లా రాసుకుంటాడు. చిత్రంగా ఈ నాటికను వీక్షించిన ప్రేక్షకుల హృదయాల మీద ఆ విభూతిరేఖలు శాశ్వతంగా నిలిచిపోవడం ఒక విశేషం.

అదొక పోలీస్టేషన్. వీరయ్య పేదవాడు. అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చి, తన కూతురు బావిలోపడి చనిపోయిందని చెప్పుతాడు. అందరూ అక్కడికి పరిగెత్తుతారు. ఇది 'నన్నెక్కించండి బోను' నాటికలోని ప్రారంభ దృశ్యం. నాటిక మొత్తం ఎంతో ఉత్కంఠంగా పోలీస్టేషన్ లోనే జరుగుతుంది. న్యాయ

గార్దభ(గాడిద)శతకం

(ఆటవెలదులు)

-హెచ్.ఆర్. చంద్రం
సెల్: 9493248053

గతమునందు నెవరు శతకము నీ పేర
వ్రాసియున్న దాఖలాలు లేవు
కాన నే రచింతు గార్దభ(గాడిద)శతకము
గాడిదా చరిత్ర కలదు నీకు!

సులభశైలి నాటవెలదుల గార్దభ
శతకమును రచించి సహృదయులకు
అందజేతు, దాన నగు నీకు మే లెంతొ
గాడిదా చరిత్ర కలదు నీకు!
నీ అదృష్ట గరిమ, నిను కావ్యవస్తువు
గా గ్రహించినాడ గాన నేను
నీ చరిత్ర యింక నిలుచు నిక్షేపమై
గాడిదా చరిత్ర కలదు నీకు!

మనుజ జాతితోడ పెనవేసుకొనిపోయి
గడపుచున్న జాతి గాన మీది
చెప్పుకొనుట లెస్స తప్పక నిను గూర్చి
గాడిదా చరిత్ర కలదు నీకు!

కాని కొంతమంది నేనేదొ చేయంగ
రాని కార్యమునకు పూనినట్లు
తలచగలరు, మనకు దాన నష్టము లేదు
గాడిదా చరిత్ర కలదు నీకు!

నేను శతకమందు నిను ప్రస్తుతించుట
వలన నవ్వుకొనెడు వారు కొంద
రుందు రందునందు సందేహమే లేదు
గాడిదా చరిత్ర కలదు నీకు!

ఎవరు నవ్వుకొన్న, ఏమనుకొన్నను
నేను లెక్కచేయబోను దాని
కవికి నచ్చినదియె కావ్యవస్తువు కదా
గాడిదా చరిత్ర కలదు నీకు!

నేను వెలువరించు నీపేరి శతకము
కనియు చదివి మెచ్చుకొనెడు రసిక
పాఠకులును కానవత్తురు పెక్కురు
గాడిదా చరిత్ర కలదు నీకు!

చిత్రమైన నీదు జీవిత ఘట్టాలు
తెలుసుకొన్న తెలివి గలుగువారు
మెచ్చకుండలేరు మేల్మేలుటంచును
గాడిదా చరిత్ర కలదు నీకు!

లోకమందు నుండు రుచిభేదములు గదా
ఉందు రెట్లు లంద రొక్క రీతి?
పొగడు వారి వలెనె తెగడువా రుందురు
గాడిదా చరిత్ర కలదు నీకు!

పొగడికలకు కవులు పొంగిపోవగరాదు
తెగడికలకు తాము వగవరాదు
స్వీకరించవలయు నేకరీతిగ రెండు
గాడిదా చరిత్ర కలదు నీకు!

గుర్తువచ్చు మాకు గుర్రము నిను జూడ
గానె, నీకు గలవు దానితోడ
పోల్కి లెన్నొ, భేదములు నుండె నొక కొన్ని
గాడిదా చరిత్ర కలదు నీకు!

'గార్దభ' మగు ప్రకృతి, 'గాడిద' వికృతియొ
దేశ్యపద మొకటియు తెలియదాయె
జనుల వాడకమున వినబడు గాడిదే
గాడిదా చరిత్ర కలదు నీకు!

వ్రాత కోతలందు పర్యాయ పదములు
గాడిదకును కొన్ని గలవు, ప్రజల
వాడకమున నుండె 'గాడిద' ఒక్కటే
గాడిదా చరిత్ర కలదు నీకు!

ఖరము రాసభమ్ము గార్దభాది పదాలు
గ్రంథ రచనలందు కానబడును
ప్రజల మాటల వినబడునది గాడిదే
గాడిదా చరిత్ర కలదు నీకు!

అందరికిని అర్థమౌ మాట గాడిద
అగుట వలన సంశయమ్ము మాని
దాని వాడియుంటి నేను మకుటమందు
గాడిదా చరిత్ర కలదు నీకు!

సంస్కృతమున మహిష(దున్నపోతు)
శతకము కల, దది
తెనుగునకును అనువదించబడెను
నీకు శతక మేలొ లేకుండె నిందాక
గాడిదా చరిత్ర కలదు నీకు!

పంది-కుక్క-పిల్లిపై వచ్చె శతకాలు
నీకు శతక మొకటి లేకపోయె
ఊరుకొనను నేను పూరింతు నా లోటు
గాడిదా చరిత్ర కలదు నీకు!

ఈ ప్రపంచమందు నెల్ల ప్రాంతములకు
విస్తరించి మిగుల వృద్ధిగన్న
జంతుజాతి మీది, సంఖ్య కోటులలోనె
గాడిదా చరిత్ర కలదు నీకు!

వేల యేండ్ల క్రితమె మాలిమి చేసుకొ
న్నాడు నరుడు నిన్ను, నాటి నుండి
అందుచుండె గాద అరుదైన నీ సేవ
గాడిదా చరిత్ర కలదు నీకు!

తెలుగు బాసలోన పలు సామెతలు నిన్ను
గలిపి చెప్పుకొనుట కలదు, కొన్ని
సారవంతమైన జాతీయములు నుండె
గాడిదా చరిత్ర కలదు నీకు!

నీతి కథలలోన నీ పాత్ర ఉండును
కానవచ్చెదవు పురాణ కథల
నెల్ల రెరుగునట్టి గృహజంతు వీ వైతి
గాడిదా చరిత్ర కలదు నీకు!

పాత్ర కలదు నీకు 'పంచతంత్ర' కథల
విష్ణుశర్మ నిన్ను విడుచు నెట్లు?
ఎన్నదగిన గుణము లున్నవి నీలోన
గాడిదా చరిత్ర కలదు నీకు!

కలవుగాని పోలికలు కొన్ని మీకు గు
ర్రాలతోడ, లక్షణాలలోన
చాల భేద ముండు, జాతి ఒక్కటె మీది
గాడిదా చరిత్ర కలదు నీకు!

ఆడు గుర్రము మగ గాడిద జతకట్టి
సంగమించెనేని సంతు కొరకు
కలుగునట్టి దౌను 'కంచర గాడిద'
గాడిదా చరిత్ర కలదు నీకు!

కానిపించు పోలికలు మీకు కంచర
గాడిదలకు కొన్ని, కాని, కనగ
వానియందు గలవు ప్రత్యేకతలు కొన్ని
గాడిదా చరిత్ర కలదు నీకు!

బరువు మోయుటందు, పర్వతారోహణ
మందు అధిగమించునంట మిమ్ము
కాన పేరుగాంచె కంచర గాడిద
గాడిదా చరిత్ర కలదు నీకు!

గంగి గోవు పాల ఘనత వేమన చెప్పె
గాడ్దె పాలు నేడు ఘనత గాంచె
వేలలోనె మీదు పాలు లీటరు ధర
గాడిదా చరిత్ర కలదు నీకు!

అక్షరాల కేజి(కిలో) లక్ష రూపాయలు
పలుకునంట గాడ్దెపాల జున్ను!
ఘనతగాంచె నిట్లు గాడ్దెజాతులు కొన్ని!
గాడిదా చరిత్ర కలదు నీకు!

ఖరము పాలు పలుకు ధర యెక్కువే గాని
పాల నిచ్చు ఖరము పరిమితముగ
నేను చెప్పవలెన నీ లీలలను నీకు?
గాడిదా చరిత్ర కలదు నీకు!

రైతు లచట నచట లాభాల నాశించి
పెద్ద మొత్తములను పెట్టుబడిగ
పెట్టి యిపుడు మిమ్ము పెంచుచుండిరి కదా
గాడిదా చరిత్ర కలదు నీకు!

మీదు పాల నిపుడు మించు పాలే లేవు
ఫలితములను బట్టె పలుకు ధరలు
అమ్మ పాల సాటి అగునట మీ పాలు
గాడిదా చరిత్ర కలదు నీకు!

పుష్కలముగ నుండు పోషకాల్ మీ రిచ్చు
పాలలోన, రోగజాలములను
అడ్డుకొనెడు శక్తి అందుండునట హెచ్చు
గాడిదా చరిత్ర కలదు నీకు!

అమ్మ పాలు తప్ప అన్యమౌ పా లెవ్వి
పాటి కావు మీదు పాల కనుచు
శాస్త్రవేత్తలెల్ల చాటుచుండిరి కదా
గాడిదా చరిత్ర కలదు నీకు!

ఖరము(గాడ్ద) పాలటంచు
కటువుగా నిరసించె
వేమ నపుడు, శాస్త్రవేత్త లిపుడు
అవియె శ్రేష్ఠ మనుచు అగ్గించుచున్నారు
గాడిదా చరిత్ర కలదు నీకు!
(అగ్గించు-పొగడు)

నిన్ను పెంచుచున్న, నీ సేవలను పొందు
చున్న, గాడిదన్న చిన్నచూపె
మనిషి నిన్ను మెచ్చి మన్నించ డేనాడు
గాడిదా చరిత్ర కలదు నీకు!

నిన్ను తిట్టులందు, నిందార్థములలోను
వాడ నేర్చినారు ప్రజలు బాగ
'గాడిద కొడు', 'కడ్డగాడిద' అట్టివే
గాడిదా చరిత్ర కలదు నీకు!

'గాడిద బరు'వనియు, 'గాడిద గు'డ్డని
తరచు చెవుల బడుట జరుగుచుండు
బహుళముగను వాడబడు మాటలె యివియు
గాడిదా చరిత్ర కలదు నీకు!

నిన్ను గలిపి వాడుచున్న పదాలెన్నొ
తెలుగు బాసలోన గలవు నేడు
అంతగా మమేక మైతివి ప్రజలతో
గాడిదా చరిత్ర కలదు నీకు!

కుక్కపైన ప్రేమ, గుర్రముపై మోజు
స్పష్టరీతి కానబరచు మనిషి
ఏల నిన్ను జూచి ఈసడించుకొనునొ?
గాడిదా చరిత్ర కలదు నీకు!

బరువు మోసి సాయపడుచుండు, వందుకు
మనిషి నిన్ను పెంచుకొనును, మాంస
మునకు పెంచువారు కనవత్తు రటనట!
గాడిదా చరిత్ర కలదు నీకు!

కానవచ్చు నేడు గాడిద మాంసము
అంగడి సరకట్టు లమ్మబడుచు
అదియు లాభసాటి వ్యాపార వస్తువే
గాడిదా చరిత్ర కలదు నీకు!

గాడిదను వధించగూడదు, తద్ మాంస
భక్షణము నిషిద్ధ వర్తనమ్మె
చేయరాదు రెండు శక్షార్థ నేరాలె
గాడిదా చరిత్ర కలదు నీకు!

స్వరము పెద్దదైన, శ్రావ్యత లేకున్న
కారణమున మెచ్చరైరి జనులు
కరకు గొంతు విన్న 'గార్దభస్వర' మంద్రు
గాడిదా చరిత్ర కలదు నీకు!

ద్వాపర యుగమందు వసుదేవునంతటి
వాడు నీదు(గాడ్దె) కాళ్లు పట్టుకొన్న
వైన మొకటి కానవచ్చు పురాణాల
గాడిదా చరిత్ర కలదు నీకు!

అవసరములలోన ఆదుకొందువు, నీకు
తగిన గౌరవమ్ము దక్కకుండె
తగ్గె మనిషిలో కృతజ్ఞతాభావము
గాడిదా చరిత్ర కలదు నీకు!
కట్టివేయరాదు గాడిద గుర్రము
ఒక్క గాట ననుట యుండెగాద
ఇందు నున్నయట్టి నింద సుస్పష్టమే
గాడిదా చరిత్ర కలదు నీకు!

వాడుకొనిరి సార్థవాహులు, చాకళ్లు
అతిశయముగ గతమునందు మిమ్ము
వదలివేసి రిపుడు పనికిరారని యింక
గాడిదా చరిత్ర కలదు నీకు!

ప్రస్తుతించ దగిన పనితన మున్నను
తగిన 'పేరు' నీకు దక్కలేదు
దక్క దెదియు వెనుక 'దన్ను' లేకుండిన
గాడిదా చరిత్ర కలదు నీకు!

నిన్ను జూచి నరుడు నేర్వదగు 'త్రిగుణ
ముల' గురించి క్రీస్తు పూర్వముననె
స్పష్టముగ వచించె 'చాణక్య' సచివుడు
గాడిదా చరిత్ర కలదు నీకు!

మంచి యెందునున్న మానక అది స్వీక
రించదగును సంశయించకుండ
నీవు మాకు గురువు కావచ్చు కొన్నింట
గాడిదా చరిత్ర కలదు నీకు!

పశువు లగును గాక, పక్షులే యగుగాక
మంచి గుణములు కనిపించెనేని
మార్గదర్శకములె మానవులకు నవ్వి
గాడిదా చరిత్ర కలదు నీకు!

కాంచగలవు తృప్తి కలదానితోడ, శ్ర
మించి విధులు నిర్వహించ గలవు
మనిషి నేర్వదగు సుగుణములొ గద యివ్వి
గాడిదా చరిత్ర కలదు నీకు!

పూర్ణ భక్తితోడ పోషించు వారికి
సేవచేయునట్టి జీవి వీవు
నేర్వవలయు నిద్ది నిను జూచి మనుజులున్
గాడిదా చరిత్ర కలదు నీకు!

పశువులందు కొన్ని, పక్షులందున కొన్ని
దైవ వాహనములుగా వసించు
ఎవరి కెక్కిరింత వీవైతివో మరి?
గాడిదా చరిత్ర కలదు నీకు!
(ఎక్కిరింత-వాహనం).

నీవు వాహనముగ దేవేంద్ర సుతునకు
ఉంటి వనుట చదివియుంటి నెపుడొ
కాని గుర్తులేవు దానివొ వివరాలు
గాడిదా చరిత్ర కలదు నీకు!

చేరినావు నీవు 'శీతలాదేవి'కి
వాహనముగ, 'అమ్మవారి' సేవ
చేయు భాగ్య మట్లు సిద్ధించినది నీకు
గాడిదా చరిత్ర కలదు నీకు!
(లక్ష్మి-సరస్వతి-పార్వతుల స్వరూపంగా, భిన్న ప్రాంతాలలో, వేరువేరు నామాలతో కొలువబడుతోన్న గ్రామదేవత శీతలాదేవి, స్కాందపురాణంలో శీతలాదేవి అష్టకం ఉన్నదట.)

అపుడె పుట్టి యేడ్చు అల సుయోధను గొంతు
గాడ్దె ఓండ్రపెట్టు కరణి నుండె
నంట, భారతమున అది వ్రాయబడి యుండె
గాడిదా చరిత్ర కలదు నీకు!

చిలకమర్తి వారి సృష్టియొ 'గణపతి'
కోరుకొనెను స్వారి కొరకు నిన్ను
కుదుర వెల్లరికిని గుర్రపు స్వారీలు
గాడిదా చరిత్ర కలదు నీకు!

గుర్రమునకు నీకు కొంత పోలిక యుండు
గాన నిన్ను దానిగా దలంచి
స్వారి ప్రభృతులందు సరిపెట్టుకొనవచ్చు
గాడిదా చరిత్ర కలదు నీకు!
గాడిద యనుచు చులుకన చేయకుండ నిన్
'జీను' వేసి స్వారి చేయవచ్చు
ప్రజలలోన సర్దుబాటు ధోరణి తగ్గె
గాడిదా చరిత్ర కలదు నీకు!

కలదు చిన్నచూపు గాడిద జాతిపై
వాని పెంచుచున్న మానవులకు
కానరావు తగిన కారణమ్ము లెవియు
గాడిదా చరిత్ర కలదు నీకు!

కలరు కొంతమంది 'గాడిద కొడుకులు'
గాడిదలకు సాటి కారు, వారి
మిమ్ము పోల్చిచెప్ప మీ కవమానము
గాడిదా చరిత్ర కలదు నీకు!

సహజ సిద్ధమైన జంతు లక్షణములు
నీవి, వాని మీర వీవు, స్వార్థ
మనుజు దతికరించు (మానవ) మౌలిక
ధర్మాలు
గాడిదా చరిత్ర కలదు నీకు!
(అతికరించు-అతిక్రమించు)

జంతు వర్తనమ్ము స్వార్థపరాయణ
మైన, బతుకు కొరకె దాని చింత
స్వార్థమునకు మనిషి వంచించు నితరుల
గాడిదా చరిత్ర కలదు నీకు!

జంతుజాలమందు సద్గుణములు కొన్ని
కలవు, నరులు నేర్వవలయు వాని
నీవు నాకు గురువు కావచ్చు, తప్పేమి?
గాడిదా చరిత్ర కలదు నీకు!

కొన్ని జంతువులకు కొమ్ములు స్వీయ ర
క్షణకు గలవు, వెనుక కాళ్లు నీకు
సహకరించుచుండు సహజాయుధమ్ములై
గాడిదా చరిత్ర కలదు నీకు!

అవసరమ్ము పడిన అవలీలగా వెన్క
కాళ్లతోడ తన్నగలవు నీవు
వెనుక కాళ్ల తన్ను కనబడు నీయందె
గాడిదా చరిత్ర కలదు నీకు!

నిలువగూడ దెపుడు నీ పృష్ఠ(వెన్క)భాగాన
తెలిసియున్న వాడు నిలువ డట్లు
వెనుక కాళ్ల తన్ను 'స్పెషలిస్టు' వౌదీవు!
గాడిదా చరిత్ర కలదు నీకు!

సృష్టి నియమమందె స్వీయరక్షణకు నే
ర్పాటు లుండగలవు, ప్రాణు లవ్వి
తెలిసి జీవితముల దిద్దుకోవలె మరి
గాడిదా చరిత్ర కలదు నీకు!

హెచ్చుతగ్గు లుండవచ్చు జీవులలోన
కాని 'తాన' ముఖ్యమౌను తనకు
'బతుకు పోరు' సల్పు ప్రతిజీవి నిత్యము
గాడిదా చరిత్ర కలదు నీకు!

ఏన్గు ముందు దో(చీ)మ యెంతటి దౌ? రెండు
బతుకు కొరకు పాటుపడును సతము
చావు కోరుకొనదు జీవి యేదైనను
గాడిదా చరిత్ర కలదు నీకు!

ఓండ్రపెట్టు టనుట యుండె నీ కూతకు
వాడకమున తెలుగు బాసలోన
'కూత-అరపు' అనుట కూడదు, నీ 'దోండ్ర'
గాడిదా చరిత్ర కలదు నీకు!

చిత్రమైన కథలు చెప్పుకొంటిమి మేము
చిన్నతనమునందు నిన్ను గూర్చి
కొన్ని యిప్పటికిని గర్తుండె లీలగా
గాడిదా చరిత్ర కలదు నీకు!

ఏన్గుతోడ పోల్చి యితర జంతువులను
మనిషి గేలిచేయు టనుచితమ్ము
దేని బతుకు తీరు దానిదే యోగదా
గాడిదా చరిత్ర కలదు నీకు!

చెప్పి నీకు పనులు చేయించుకొనవచ్చు
చేతనైన వెల్ల చేయగలవు
అన్ని పనులు చేయ రందరు లోకాన
గాడిదా చరిత్ర కలదు నీకు!

శాంతమూర్తి వీవు, శక్యమౌ పను లెల్ల
చేతువు యజమాని చెప్పునెడల
గేలిసేయ దగదు నీలాటి బే(గో)లల!
గాడిదా చరిత్ర కలదు నీకు!

విష్ణుమూర్తి యెత్తె వివిధావతారాలు
చేప-పంది అందు జేరె గాని
నీ అదృష్ట మేమొ నీవందు లేవైతి
గాడిదా చరిత్ర కలదు నీకు!

అశ్వ ముఖులు మరియు
అశ్వ దేహులు దేవ
గణములందు గలరు, కాని అట్టి
ముచ్చటైన లేకపోయె నీ చరితాన
గాడిదా చరిత్ర కలదు నీకు!
(కింపురుషులు అశ్వముఖులు , కిన్నరులు అశ్వదేహులు)

ఏన్గు తలకు దక్కె నెంత అదృష్టమో
గణపతి తల యయ్యె, ఘనత గాంచె
అట్టిదౌ అదృష్టమైన పట్టదు నీకు
గాడిదా చరిత్ర కలదు నీకు!

గార్దభావతార కథ పుట్టి గ్రంథాల
కెక్కలేదు గాని, ఎక్కియున్న
భూనభోంతరాల మ్రోగదా నీ పేరు?
గాడిదా చరిత్ర కలదు నీకు!

గతమునందు శతకకారులు సైతము
చూచినారు చిన్నచూపు నిన్ను
వారి వ్రాతలందు స్పష్టమౌ నీ మాట
గాడిదా చరిత్ర కలదు నీకు!
(వేమన,శేషప్ప(నరసింహశతక కవి)

అన్ని కలసివచ్చు అర్హతల్ లేకున్న
కొంతమంది, కందుకొనవు నీవు
అర్హఫలము లైన, అదికదా నీ కర్మ
గాడిదా చరిత్ర కలదు నీకు!

ద్వాపరమున నీవు వసుదేవునకు సాయ
పడిన మాట వాస్తవమ్ము కాద?
దాని వలన నీకు దక్కిన ఫలమేమి?
గాడిదా చరిత్ర కలదు నీకు!

కష్టజీవి వగుచు, గతమున జనజీవి
తమున నైక్యమైన దాన వీవు
ప్రస్తుత మిట అవసరము తగ్గె నీతోడ
గాడిదా చరిత్ర కలదు నీకు!

సామెతలను గలవు, జాతీయములలోన
గలవు, తిట్లలోను గలవు నీవు
భాషలోన ముఖ్య భాగమైపోతివి
గాడిదా చరిత్ర కలదు నీకు!

చూడవచ్చు నిన్ను బూడిద, గోధుమ
రంగులందు, తెలుపు రంగునందు,
నలుపు రంగు గలదు,కలగలుపులు నుండు
గాడిదా చరిత్ర కలదు నీకు!

క్షీరదమ్ము, సాధుశీలి, శాఖాహారి,
కష్టజీవి నీవు కావె చెపుమ
వృద్ధిగంటి వీవు పెంపుడు జంతువై
గాడిదా చరిత్ర కలదు నీకు!

పట్టణాల కన్న పల్లెటూళ్లందునే
హెచ్చు సంఖ్య గానవచ్చువారు
అది గతమున, నిప్పు డటనిట నొకతీరె
గాడిదా చరిత్ర కలదు నీకు!

గతమువోలె కాదు, గణనీయముగ తగ్గి
పొయె మీదు సంఖ్య, పోను పోను
అంతరించు జాతి అగునేమొ మీ దయ్యొ
గాడిదా చరిత్ర కలదు నీకు!

మీరు కానబడరు, మీ 'ఓండ్ర' వినరాదు
తరచు దర్శనమ్ము జరుగదాయె
కష్టసాధ్య మయ్యె 'ఖర దర్శనము' నేడు
గాడిదా చరిత్ర కలదు నీకు!

తెచ్చి గృహమునన్ ప్రతిష్ఠించుకొన్న నీ
ప్రతిమ నొకటి చాలు ప్రజల కింక
దక్కుగాదె నిత్యదర్శన భాగ్యము
గాడిదా చరిత్ర కలదు నీకు!

కొంత కాలమునకు జంతు ప్రదర్శన
శాలనె నిను జూడ సాధ్యమేమొ?
చెప్పలేము, నేటి స్థితిగతు లట్లుండె
గాడిదా చరిత్ర కలదు నీకు!

పనికిరాని దెదియు కనరాదు సృష్టిలో
వాడుకొనుట నేర్వవలయు జనులు
పనికిరావె నీవు పనిపాటులందున?
గాడిదా చరిత్ర కలదు నీకు!

గాడ్దెపైన నొకని గ్రామాన నూరేగ
జేసి రనిన పరువు తీసినట్లె
గతమున నొక శిక్షగా నది వర్తిల్లె
గాడిదా చరిత్ర కలదు నీకు!

గాడిదలకు గూడ కల దొక్క దినము! మే
యెనిమి దది, ప్రపంచ మెల్ల దీని
జరుపుచుండు రంట, సంతోషమే కదా
గాడిదా చరిత్ర కలదు నీకు!

కొంతమంది మెచ్చుకొందురు, మెచ్చరు
కొంద, రంతమాత్ర కుందనేల?
గొప్పవారు మెచ్చుకొనిరి కదా నిన్ను
గాడిదా చరిత్ర కలదు నీకు!

నీకు మేతబెట్టు నీ యజమాని క
ష్టించి నీవు పనులుచేయు కతన
పనులు చేయకున్న నిను మేప డెవ్వడు
గాడిదా చరిత్ర కలదు నీకు!

అన్యు లెవరిపైన ఆధారపడబోవు
బతుకగలవు కష్టపడుచు నీవు
పరుల మోసగించవలసిన పని లేదు
గాడిదా చరిత్ర కలదు నీకు!

మారుచుందురు యజమానులు కాని, నీ
కష్టమందు మార్పు కానబడదు
నడుచుకొందు వీవు నమ్మినబంటు వై
గాడిదా చరిత్ర కలదు నీకు!

సక్రమముగ పనులు జరుగకుండిన యజ
మాని ఆగ్రహించు, మందలించు
'బడితపూజ' నీకు పరిపాటియే కదా
గాడిదా చరిత్ర కలదు నీకు!

వాడుకొనగవచ్చు పలు విధమ్ముల నిన్ను
కష్టపడగ శక్తి కలదు నీకు
మనిషి కుండవలయు సునిశితమౌ బుద్ధి
గాడిదా చరిత్ర కలదు నీకు!

నష్టపోయినారె నమ్మి ని న్నెవరైన?
బాధపడిర నీ ప్రవర్తనమున?
సాధుజీవి వీవు, సత్ప్రవర్తన నీది
గాడిదా చరిత్ర కలదు నీకు!

కష్టపడక యున్న కడుపు నిండదు నీకు
పిలిచి నీకు మేతపెట్ట రెవరు
సానుభూతి కలుగు సంస్కారు లెందరు?
గాడిదా చరిత్ర కలదు నీకు!

జీవరాశు లెల్ల దైవాంశ సంభూతు
లనుట కల్ల! లోకమందు లేదు
సమత యెందు, జూడ సర్వత భేదమే
గాడిదా చరిత్ర కలదు నీకు!

ప్రజల ముంచుచున్న వంచక నేతల
తోడ నిన్ను పోల్చగూడ దెవుడు
స్వార్థపరులు వారు, శ్రమజీవి నీ వౌదు
గాడిదా చరిత్ర కలదు నీకు!

కలసి మెలసి యుండగలరు మీ రెపు, దైక
మత్యమునకు మీరు మారుపేరు
సంఘ జీవనమ్ము స్పష్టమౌ మీలోన
గాడిదా చరిత్ర కలదు నీకు!

చాటుపద్య ముండె, మాట తప్పిన వాని
'గాడిద కొడు' కనగ గాడ్దె యేడ్చె
ననుచు, నట్టిదైన స్వాభిమానము మీది
గాడిదా చరిత్ర కలదు నీకు!

పనికిమాలినట్టి వారిని నిందించ
నిన్ను పోల్చజేయ నేరము కద
జరుగుచుండె నీకు పరువునష్టము దాన
గాడిదా చరిత్ర కలదు నీకు!

పట్ట దొకరి జోలి, పరులకు భారము
కావు, నిత్య కష్టజీవి వగుచు
మార్గదర్శివోలె మాకు కన్పింతువు
గాడిదా చరిత్ర కలదు నీకు!

అందరికి పరిచితమైన పెంపుడు జంతు
వీవు, నిన్ను గూర్చి యెచట నుండి
కొత్త విషయములను కొనితేగలను నేను?
గాడిదా చరిత్ర కలదు నీకు!

అందరికిని తెలిసినట్టి అంశాలు సిం
హావలోకనముగ అప్పుడప్పుడు
చెప్పుకొనుట వలన ముప్పేమి కలుగదు
గాడిదా చరిత్ర కలదు నీకు!

సొంత బుర్రతోడ కొంత ఆలోచించి
మంచి చెడ్డ నిర్ణయించ వలయు
పరుల భావనలను పట్టి వ్రేలుట తప్పు
గాడిదా చరిత్ర కలదు నీకు!

శక్తి కలదు నీకు, శ్రమకు వెన్కాడవు,
విస్మరించబోవు స్వీయ విధుల
ఐన మెచ్చదుగద మానవజాతి నిన్
గాడిదా చరిత్ర కలదు నీకు!

కానవచ్చు మన పురాణ గాథల 'గార్ద
భాసురు' డనునట్టి పాత్ర యొకటి
కాని గుర్తులేవు దానివొ వివరాలు
గాడిదా చరిత్ర కలదు నీకు!

పనులు చేయ గలవు, పాల నీయగలవు,
మాంస మియ్యగలవు మానవులకు
కామధేనువట్లు కనిపించవా నీవు?
గాడిదా చరిత్ర కలదు నీకు!

సాధుజీవి వీవు, 'జాతీయ జంతువు'
పదవి నీ కొసంగవచ్చు! దాని
కొరకు నడుము కట్టుకొను 'పెద్ద' లెవ్వరు?
గాడిదా చరిత్ర కలదు నీకు!

పుట్టి అడవిలోన, మెట్టి జనపదమ్ము,
మనిషితో మమేకమైతి వీవు
కాని, దాపురించె కాని(కష్ట)కాలము నీకు
గాడిదా చరిత్ర కలదు నీకు!

శతకపూర్తి కష్టసాధ్యమౌ ననుకొంటి,
తస్పదియ్య నన్ను(నీవె) తరిమి తరిమి
పద్య శతక మిట్లు వ్రాయించుకొన్నావు
గాడిదా చరిత్ర కలదు నీకు!

కడకు ముగిసె నిట్లు 'గార్దభ శతకము'
కలిగె నాకు తృప్తి, గాని దీని
చదివి పాఠకాళి సంతృప్తి పడవలె
గాడిదా చరిత్ర కలదు నీకు!

ఇక ముగించుచుంటి నీ శతకము, పాఠ
కులకు స్వస్తి! నీకు కలుగు మేలు!
కలము దించి నేను సెలవు గైకొందును
గాడిదా చరిత్ర కలదు నీకు!

షావుకారు కుక్క

-డా॥నందిని సిధారెడ్డి
సెల్:9440381148

1981లో రాసిన కథ

నాటి తరం వారి కథలు నేటి తరానికి
కథల వంతెన



"బ భౌ"

"ఇడియట్" అని స్టైల్‌గా, పరమ నాగరికంగా తిట్టాలని చాలా రోజుల్నుంచి కోరిగ్గా వుంది. కానీ ఇంగ్లీషు రాక అలా వినిపించింది.

"మాదర్ఫోత్" అని ఆ వూరి దొరలా దర్జాగా, దర్పంగా తిట్టాలని ఒకటే ఇదిగా వుంది. కానీ ఉర్దూ పలకలేదు. "బోసీ-డీకే' అని షావుకారిలా అజీర్ణంగా, గుర్రుగా తిడదామనుకుని అసలు మాట రాక ఇవన్నీ వదబోసి విసిరినట్టుగా, 'బభౌ' మంది.

కుక్కని మొగురానికి కట్టేసి కొట్టంలోకి వెళుతున్న నారాయణ వెనక్కి తిరిగి చూశాడు. కుక్క మొరుగుతోంది. ఒకటికి రెండేసిసార్లు చుట్టూ తిరిగి చూశాడు. కుక్క మొరుగుతోంది. ఎవరూ కనిపించలేదు. తనని చూసే మొరుగుతుందని నిర్ధారించుకున్నాడు. ముక్కు విరుచుకున్నాడు. వంగి కాలి కింద చిన్న చెక్క పేడును తీసి దానివేపు విసిరి దొడ్లోకి వెళ్లిపోయాడు. కానీ, మెదడులోంచి ఆ కుక్క మొరుగు వెళ్లిపోలేదు.

తన రాక కోసం గింజుకున్నట్టుండే కుక్క- చేతుల బిస్కట్లు, పాలు పట్టుకొస్తాంటే అమాయకంగా, ఆప్యాయంగా చూసే కుక్క-గోముగా తన చేయిని నాకుతూ మెత్తగా, సింది రాముడి పద్యం వింటూన్నట్టు తోకాడించే కుక్క- తను ఎవరి మీదికి ఉసిగొల్పితే వాళ్ల ఒళ్లంతా పీకి, పీకి తన పక్కనకొచ్చి చేరి మెప్పుకోసం ఎదుర్చూస్తున్నట్టు నిల్చునే కుక్క కొత్తగా, ఈ రోజు ఆ విధంగా తనవైపు అసహ్యంగా చూస్తూ ఎందుకు మొరిగిందో అర్థం కాలేదు నారాయణకి.

కుక్క ఇంకా మొరుగుతోనే వుంది. అసహ్యం, కోపం, నిరసనం.. అలాంటివి చాలా కలగలిసినట్టు ఆగి ఆగి అదే మొరుగు! తిట్లని చెరుగుతున్నట్టు ఒకటే మొరుగు!

అన్ని కుక్కల్లాగా ఆ కుక్కా విశ్వాసమైందే. ఆర్నూరు వూళ్లల్లోకి అంత మంచి కుక్క లేనేలేదని షావుకారు వీరేశం చెబుతుంటాడు. షావుకారు దృష్టిలో నారాయణ ఎంత విశ్వాసంగా, వినమ్రంగా, భక్తిగా వుంటాడో- అంతకన్నా ఆ కుక్క ఏమీ తీసిపోదు. అందుకే, నారాయణ ఏదన్నా తప్పు చేస్తే, **"గా కుక్కకున్న గుణమన్నాలేక్పాయె. ఎండ్కు బత్కి,"** అని తిడతాడు కూడా. షావుకారు ఆ మాట అన్నప్పుడు కుక్క చాలా సంతోష పడ్తున్నట్టు గర్వంగా తోకాడించేస్తుంది.

కుక్క మొరిగింది, మళ్లా. పడమటి చెరువులో నీళ్లకుండలాగా, బుడుంగున మునిగి పోయాడు సూర్యుడు. వెలుతురు తగ్గిపోయి, ఖాతా పుస్తకంలో అక్షరాలు కనబడకపోయేసరికి కళ్లద్దాలు తీసి పక్కన పెట్టాడు వీరేశం. చేతులు పైకి ఒళ్లు విరుచుకుంటూ, ఆవులించి నారాయణని కేకేశాడు.

"యాడ జచ్చినవ్, నారిగా, పొద్గూకె, లైటు ముట్టియ్యాల్నని ఎర్కలేదా? జల్ది ముట్టిచ్చుకరా.. యిన్పద్దాదిర," అని ఇంకా ఏదో తక్కువైనట్టు, "తిన్తిని మరు పెక్కు వైతంది," అని గొణుక్కున్నాడు.

నారాయణ పెట్రొమాక్స్ లైట్ తీసుకొస్తుంటే బయట మొగురం చుట్టూ తిరుగుతున్న కుక్క ఆకస్మాత్తుగా ఆగి, 'బభౌ'మని మొరిగింది మళ్లా, షావుకారు కన్ని, ఎంతో మేల్కయింది. ఇంతల కారు కుక్క కేసి కొత్తగా చూసి, ఏమైంది. ఎవరన్న ఆ జాజల రామి **"దీనికేం బుట్టిందో, మొర్గుతాంది ఎన్నడ్లేంది,"** అని కళ్లద్దాలు పెట్టుకుని బుక్కులో మునిగిపోయాడు.

అస్తమించిన సూర్యుడు షావుకారి ంట్లో.. ఆ పెట్రోమాక్స్ లైట్‌లో దాక్కుని ఉన్నట్టు చుట్టూ వెలుతురు తెల్లగా అల్లుకుంది.

చూస్తుంటే, చూస్తుంటే నారాయ ణకు **'పైస-పైసుంటే ఎంత సుఖపడొ చ్చే.."** అనిపించి ఆలోచనలో పడ్డాడు.

తన తడకలిల్లు- ఆ కొంచెం జాగలో గింతన్న ఎలగని గుడ్డి దీపం- ఆ చిన్న కుటుంబానికైనా కడుపు నింప లేని తన బీదతనం- అన్నీ మారిపో తయ్.. ఆ ఆశతోనే అన్ని రకాల తిట్ల నూ, తన్నుల్నీ భరిస్తూ షావుకారు దగ్గర కుక్క కంటే హీనంగా.. కుక్క మళ్లా మొరగటంతో ఉలిక్కిపడ్డాడు. ఒకచేత పాలగిన్నె, ఒకచేత డబుల్‌రొట్టె తీసుకెళ్లి కుక్క ముందు పెట్ట తినిపించబో యాడు. అది జాడించింది. పాలు పడిపో యాయి. పక్కకు జరిగాడు నారాయణ. కుక్క రొట్టె కూడా రుచి చూడలేదు. నారాయణ వంక చూసి మొరిగింది. తనే కలిగించుకుని తినిపించబోయాడు మళ్లా. మొండికేసి కరవబోయింది. బిగపట్టుకుని పరిగెత్తాడు వాకిట్లోకి.

ఎందుకు తినట్లేదో, తనని చూసి ఎందుకు మొరుగుతుందో నారాయ ణకెంతకూ అర్థంకాలేదు. ఆ విష యమే షావుకారుతో చెప్పాడు. ఏమైం దో చూద్దామని బయటకొచ్చాడు వీరే శం. ఈసారి వీరేశం వంక చూస్తూ వరుసగా, తీవ్రంగా మొరిగిం ది. ఆ మొరగటంతో తన తిట్లే తిప్పికొ డుతున్నట్లనిపించింది. పెద్ద పీట కింద వారు తీశాడు. దాన్ని దబదబా కొట్టా డు. షావుకారమ్మ కౌసల్య వేగంగా పరిగెత్తుకొచ్చి ఆపటం కూడా జరిగిపో యింది. కుక్క ఏవో తలపోస్తు న్నట్టు భయంకరంగా అరవ నారంభించిం ది. లాభం లేదనుకుని అందరూ అక్కణ్ణుంచి వెళ్లిపోయారు.

కౌసల్య భర్తని అన్నానికి పిలిచింది. అన్నం ముందు కూచున్నా, షావుకారు ఆలోచన్

తామ్రపత్ర గ్రహీత శ్రీమతి పోకల తారమ్మ (1900-1978)

జననం: 1900, బరంపురం
తండ్రి: జోస్యుల చినసిద్దాంతి
తల్లి: సుందరమ్మ
భర్త: పోకల సత్యనారాయణ

భర్తతో రాట్నం వడకటం, ఇంట్లో జాతీయ జెండా ఎగురవేయటం, సత్యాగ్రహులను కలుసుకోవటం నిత్యకృత్యంగా ఉండేది. జాతీయోద్యంలో చురుకుగా పాల్గొన్నారు. పర్లాకిమిడి చుట్టు ప్రక్కల గ్రామాలలో మహిళా సంఘాలు నెలకొల్పి, మహిళలలో స్వాతంత్ర్య భావనలు మేల్కొలిపారు. పోలీసుల హెచ్చరికలకు, లాఠీ దెబ్బలకు బెదరలేదు. శ్రీ వి.వి.గిరి, శ్రీ గౌతు లచ్చన్న, ఆచార్య ఎన్.జి. రంగా ప్రభృతులతో ఉద్యమంలో పాల్గొన్నారు. సత్యనారాయణ-తారమ్మ దంపతులిరువురూ ఆంధ్రాలీగ్స్ అసోసియే షన్ సభ్యులు, ఒక పక్క ఉద్యమంలో పాల్గొంటూనే ఉద్యమకారులకు భోజన సదుపాయాలు సమకూర్చే వారు.

తారమ్మగారి సమరం స్ఫూర్తి దాయకం:

ఉద్యమంలో వివిధ దశలలో అరెస్టు కాబడి జైలు జీవితం అనుభవించారు. మొదట తారమ్మగారిని రాజ మండ్రి జైలులో ఉంచారు. తర్వాత కేరళ, కన్ననూర్ జైలులో మూడేళ్ళు 'సి' క్లాస్ ఖైదీగా అష్టకష్టాలు పడ్డారు.ఒకే హాలులో అరవై డబ్బై మందితో కలిసి ఉండవలసి వచ్చేది. ఆహారం సరిగ్గా ఉండేది కాదు. స్నానానికి అనుమతి ఇచ్చేవారు కాదు. తలకి నూనె కూడా ఉండేది కాదట! ఆమె మానసికంగా కృంగి పోయారు.ఈ సమాచారం భర్తకు తెలియజేయలేదు. అనారోగ్యంతో దయనీయమైన స్థితిలో ఉన్న ఆమెని జైలు అధికారులు జైలు నుంచి విడు దల చేసి బయట చెట్టు కింద వదిలే శారు. శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు గుర్తుపట్టి పర్లాకిమిడి పంపించారు.

తామ్రపత్ర సత్కారం:

స్వాతంత్ర్య రజతోత్సవ వేడుకలలో 1972 ఆగష్టు 15వ తేదీన పోకల తారమ్మను ఢిల్లీలో నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ తామ్రపత్రంతో సత్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల ఫించన్ నెలకు 300/-రూ. ఆమెకు మంజూరు చేశారు. తారమ్మ 1978 సెప్టెంబర్ 25న పర్లాకిమిడిలో కన్నుమూశారు.

శ్రీ కారుమూరి కామేశ్వరరావు

పర్లాకిమిడి (1901-1976)

శ్రీ కారుమూరి కామేశ్వర రావు 1901లో జన్మించారు. అతి పెద్ద వ్యాపారవేత్త, భూస్వామి. జమీందారులతో సరితూగే సిరిసంపదలుండేవి. అన్నింటిని తృణప్రాయంగా త్యజించి స్వాతంత్ర్య ఉద్యమంలో దిగారు. 1926/27లో గాంధీజీ పర్లాకిమిడి వచ్చినపుడు వీరి ఇంటిలోనే బస చేశారు. గాంధీజీ సమక్షంలో లక్షలాది రూపాయలు విలువచేసే వస్త్రువులు, పట్టు బట్టలను, రాజవీధిలో కుప్పగా పోసి తగుల బెట్టారు. ఆ ప్రాంతాన్ని షరాబుల కుప్ప అనేవారు. ఆయనకి ఉన్న పెద్ద వస్త్ర వ్యాపారాన్ని, లైసెన్సులను విడిచిపెట్టి విదేశీ వస్త్రువుల బహిష్కరణకు నాంది పలికారు. తనకి ఉన్న బ్రాందీ లైసెన్సును నిలిపివేసి, బ్రాందీ సీసాలను తగులబెట్టారు. ఖద్దరు ప్రచారాన్ని గ్రామ, గ్రామాలలో చేసేవారు. దంపతులు ఇద్దరూ ఆంధ్రా లీగ్స్ అసోసియేషన్‌లో సభ్యులు.

కామేశ్వరరావు 1976లో కన్నుమూశారు.

శ్రీమతి కారుమూరి నాగరత్నమ్మ

భర్త: కారుమూరి కామేశ్వరరావు
జన్మస్థలం: నరసాపురం.

భర్తతో కలిజి జాతీయోద్య మం వివిధ దశలలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమం వివిధ దశలలో జరిగే ఆందోళనలకు ప్రణాళికలు రూపొందించటానికి నాయకులు వీరి ఇంట్లోనే సమావేశమయ్యేవారు. అంతేకాదు కనిపిస్తే కాల్చేయమని ఉత్తర్వులు ఉన్నవారికి వారి ఇంట్లో ఆశ్రయం కల్పించేవారు. అన్నపానాదులన్నీ నాగరత్నమ్మ స్వయంగా చూసేకునేవారు. పుచ్చలపల్లి సుందరయ్య వంటి నాయకులు వీరి ఇంట్లో నెలల తరబడి ఉన్నారు. పోలీసుల లాఠీ దెబ్బలకు, శిక్షలకు బయపడేవారు కాదు. పింఛను, తామ్రపత్రాలను కూడా అందుకునేందుకు తిరస్కరించిన మహనీయులు వీరు.

డాక్టర్ పోచిరాజు వైకుంఠం

పర్లాకిమిడి (1891-1973)

జననం: గంజాం జిల్లా, పురుషోత్తపురం
తల్లిదండ్రులు: కృష్ణయ్య పంతులు, నారాయణమ్మ

విద్యాభ్యాసం:

బాల్యంలోనే తల్లి నారాయణమ్మగారు మలేరియా జ్వర పీడితురాలై పసరు వైద్యం వలన మరణించటం వైకుంఠం గారిని కలిచివేసింది. ఎలాగైనా ఆధునిక వైద్యం అభ్యసించాలని, వైద్యవృత్తి చేపట్టాలని పట్టుదల పట్టారు. ఆ రోజుల్లో శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబాలలో డాక్టర్ చదువుకి అంగీకరించేవారు కాదు. వైకుంఠం జంధ్యాన్ని తీసివేసి బ్రహ్మ సమాజంలో చేరారు. జాతి నుంచి వైకుంఠాన్ని వెలివేశారు. ఇంటి బయట అరుగు మీద ఆకులో అన్నం పెట్టేవారట వారి అమ్మమ్మ. తర్వాత ఆమె తలస్నానం చేసేవారట! ఈ సామాజిక సమస్యలని అధిగమించి ఎల్.ఎమ్.పి. చదువు పూర్తి చేశారు.

ఉద్యోగ జీవనం:

కోరాపుట్-జయపూర్ ఏజన్సీ అటవీ ప్రాంతంలో ఉద్యోగాన్ని ప్రారంభించారు. అక్కడ ఆదివాజి సవరలకి ఆధునిక వైద్య విధానాలపట్ల అవగాహన కలిగించి వారిలో మార్పు రావటానికి ప్రయత్నించారు. మహిళలలో ప్రసూతి మరణాలు ఉండకూడదని, ప్రసవానంతరం తల్లి బిడ్డా క్షేమంగా ఉండాలని జాగ్రత్తలన్నీ తీసుకునేవారు. ఆయన సేవా దృక్పథం తెల్ల దొరలకి నచ్చలేదు. ఒకరోజు కలెక్టర్ భార్యకి తలనెప్పి వచ్చింది. ఆమె అన్నగారు ఆసుపత్రి ఉన్నతాధికారి. వైకుంఠం గారిని వెంకటనే వెళ్ళి ఆమెని చూడాలని ఆదేశించాడు. ప్రసూతి వేదనతో రెండు రోజులుగా ఒక బీద సవర స్త్రీ చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతోంది. ఆమెకి వైద్య సేవలందిస్తూ తన సహాయకుడైన మరో వైద్యుడిని కలెక్టర్ భార్య వద్దకు పంపారు వైకుంఠం. వైకుంఠం గారి చికిత్సతో సవరమహిళ పండంటి బిడ్డకి జన్మనిచ్చింది. సవరదంపతులు సంతోషం తో బిడ్డతో తిరిగి వెళ్ళారు. తన మాట వినలేదని ఆసుపత్రి ఉన్నతాధికారి సంజాయిషీ అడిగాడు. నిష్కారణంగా "యూ బేస్టర్డ్" అని వైకుంఠాన్ని దూషించాడు. కోపంతో వైకుంఠం విసిరిన రూళ్ళ కర్రదొర చేతికి తగిలింది. అంతటితో వైకుంఠం ఆసుపత్రి ఉద్యోగ జీవితం ముగిసింది. స్వతంత్ర జీవనం సాగించాలని, నిర్ణయించుకుని జీవనంలో మరో అధ్యాయానికి శ్రీకారం చుట్టారు.

పర్లాకిమిడిలో నివాసం

పర్లాకిమిడిలో వైద్యవృత్తి ప్రారంభించారు. వైద్యో నారాయణో హరిః అన్నసూక్తికి పర్యాయపదంగా రోగులకి సేవలు అందించ సాగారు. అన్యాయాలకు, అక్రమాలకు రాజీ పడని తత్వం ఆయనది. గాంధీగారి ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు.

స్వాతంత్ర్యోద్యమం:

కాంగ్రెస్ పార్టీకి పరోక్షంగా అన్ని విధాలా సాయం అందించేవారు. రెండు పూటలా రాట్నం వడికి, నూలు తీసేవారు. ఎల్లప్పుడూ ఖద్దరు ధరించేవారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యమ వీరులకి సహాయం, ధన సహాయం అందించేవారు. గాంధీ గారి ఆశయాలలో ఒకటైన హిందీ ప్రచారాన్ని పర్లాకిమిడి ప్రాంతంలో మొదట ప్రారంభించిన ఘనత ఆయనదే. తన ఇంటి ముందు ఉన్న కారు షెడ్డుని హిందీ బడిగా మార్చి, తరగతు వారీగా విద్యార్థులకు హిందీ బోధించేవారు. వార్ధా హిందీ ప్రచార సమితి, దక్షిణ భారత హిందీ ప్రచార సంఘం నిర్వహించే హిందీ పరీక్షలకి బాల బాలికలను పంపేవారు. స్త్రీ విద్యావ్యాప్తికి విశేషకృషి చేశారు.

తలవంచని వ్యక్తిత్వం:

వైకుంఠం అధికారబలానికి, అహంకార పూరితమైన శాసనాలకు తలవంచే మనిషి కాదు. వీరు పర్లాకిమిడిలో 'గండికోట' ఇంటిపేరు గల లాయర్ గారింట్లో అద్దెకి ఉండేవారు. ఒక రోజు సాయంత్రం రాజు దివాణం నుంచి ఉద్యోగి వచ్చి "రాజు గారు కోటలో ఉన్నారు. అంత పెద్ద దీపం పెట్టకండి" అని చెప్పారు. దానికి వైకుంఠం "మీ రాజు తన కోటలో ఉంటే ఈ పోచిరాజు గండికోటలో ఉన్నాడని చెప్పండి" అన్నారు. అసలు సంగతి ఏమంటే రాజు కోటకి ఎదురుగా ఉండే వీధిలో పెద్ద దీపాలు ఏ ఇంట్లోనూ వెలగకూడదు. గ్రామ్‌ఫోన్‌లో పాటలు విన్పించకూడదు. ఇలాంటి నిరంకుశ శాసనాలని లెక్క జేయని సాహసి డా॥ పోచిరాజు వైకుంఠం.

గిడుగు రామమూర్తి గారితో సాన్నిహిత్యం:

ఆంధ్రోద్యమ సంక్షోభంలో గిడుగు రామమూర్తి, సీతాపతి గార్లు తెలుగు వారి పక్కన నిలిచారు. ఆ సమయంలో వైకుంఠం గిడుగువారి పక్కనే నిలిచారు.

తెలుగు ప్రముఖుల అభీష్టానికి వ్యతిరేకంగా నూటికి 70శాతం తెలుగు ప్రజలు నివసించే గంజాం, అవిభక్త కోరాపుట్ జిల్లాలతో ఒడిశా రాష్ట్రం 1936 ఏప్రియల్ 1వ తేదీన ఏర్పడింది. గిడుగువారు ఊరు వదలి వెళ్ళిపోతు ంటే "నేను మాత్రం ఈ ఊరు వదలను. ఇక్కడే ఉండి వీళ్ళతో పోరాడతాను'' అని వైకుంఠం అన్నారు.జాతీయవాదిగా, మానవతావాదిగా, మా డాక్టరుగా ప్రజల మనస్సులో స్థానం సంపాదించుకున్న డా॥ వైకుంఠంగారు 1973 ఏప్రియల్‌లో కన్నుమూశారు.

శ్రీ బంకుపల్లి కృష్ణశాస్త్రి

పర్లాకిమిడి

తండ్రి: కవి, పండితుడు, సంస్కారవాది శ్రీ బంకుపల్లి మల్లయశాస్త్రి
తల్లి: వెంకట రత్నమ్మ

బరంపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా సేవలందించారు.

1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో అరెస్టు చేయబడి జైలు పాలయ్యారు.



డా॥ తుర్లపాటి రాజేశ్వరి వెలువరించిన "భారత స్వాతంత్ర్యోద్యమంలో ఒడిశా తెలుగు యోధులు" గురించి నేటినిజం పాఠకుల కోసం..

శ్రీలాడి జయరాం

రాయగడ

స్వస్థలం: జిమిడిపేట
జననం: 20-10-1920

గాంధేయవాదులు గాంధీ, జయప్రకాశ్ నారాయణ్ (జె.పి)ల వెంట బిసం కటక్ వరకూ పాదయాత్రలో పాల్గొన్నారు. స్వతంత్ర పార్టీలో ఉండి దేశసేవ చేశారు. జాతీయోద్యమంలో పాల్గొని పలు సార్లు బ్రిటీషు అధికారుల దండనకి గురి అయ్యా రు. ఖాదీ ఉద్యమంలో శ్రీ చెలికాని సీతారామస్వామితో కలిసి పాల్గొని ఇంటింటా ఖాదీ ప్రచారం చేశారు.

1965-70లలో జమిడిపేట పంచాయతీ ప్రెసిడెంటుగా సేవలందించారు.

తామ్రపత్ర గ్రహీత శ్రీ మేకా కామేశ్వరరావు

(1927-1997) రాయగడ

స్వస్థలం: రాయగడ దరి జమిడి పేట.

జయపురం సంస్థానంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. జాతీయోద్యమంలో పాల్గొని, జైలు జీవితాన్ని అనుభవించారు.

స్వాతంత్ర్యం వచ్చాక వీరిని భారత ప్రభుత్వం తామ్రపత్రంతో సత్కరించింది

తామ్రపత్ర గ్రహీత శ్రీ బంకుపల్లి సూర్యనారాయణశాస్త్రి

పర్లాకిమిడి

తండ్రి: బంకుపల్లి మల్లయ్యశాస్త్రి
తల్లి: వెంకట రత్నమ్మ

జాతీయోద్యమం వివిధ దశలలో పాల్గొన్నారు. విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్లాకిమిడి రాజు కోట ముందు సీమ వస్త్రాలు కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి తగులబెట్టారు. ఈ కారణంగా పర్లాకిమిడి రాజు ఆగ్రహంతో తండ్రి మల్లయ్యశాస్త్రినీ, సూర్య నారాయణ శాస్త్రినీ ఇరువురిని ఉద్యోగాల నుంచి తొలగించారు.

సంస్కృతం, తెలుగు ఆంగ్లంలో పాండిత్యం కలిగిన శాస్త్రిగారు ఉభయ భాషాప్రవీణ. అటు పిమ్మట వీఉ శ్రీకాకుళం జిల్లా ఉర్లాం ప్రభుత్వ హైస్కూలులో గ్రేడ్ 1 తెలుగు పండితులుగా ఉద్యోగం చేశారు. అనంతరం బరంపురం దగ్గర ఉన్న గోపాల్‌పురం ప్రైవేటు పాఠశాలలోనూ తెలుగు పండితునిగా సేవ లందించారు. స్వాతంత్ర్యానంతరం వీరిని భారత ప్రభుత్వం తామ్రపత్రంతో సత్కరించింది. స్వాతంత్ర్య యోధులకిచ్చే పింఛను కూడా మంజూరు అయింది.

శ్రీ మహంతి విశ్వనాధం

(1926-2021) రాయగడ



జననం: 16-9-1926. పార్వతీపురంలో.
తల్లి: చంద్రమ్మ
తండ్రి: అప్పలస్వామి.

మహంతి విశ్వనాధం గాంధీజీ బోధనలచే స్ఫూర్తి పొందారు. యస్.యస్.ఎల్.సి. చదువుతూ ఉద్యమంలో ప్రవేశించారు. పార్వతీపురం వేణుగోపాల్ సినిమా హాల్ వద్ద 1945 సెప్టెంబర్ నాడు ఉద్యమ నినాదాలు చేస్తున్న వీరిని, వీరితో పాటు మదేపు శివున్నాయుడు, సిఖా అప్పలస్వామిని అరెస్టు చేసి రాజమండ్రి జైలుకి తరలించారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఎనిమిది రోజుల ఖైదు అంతరం పోలీసువారు పార్వతీపురం యువకులను తీసుకువచ్చి విజయనగరంలో వదిలిపెట్టారు. కాంగ్రెస్ కార్యకర్తలు మహంతి విశ్వనాధం, మరికొందరు ఉద్యమ కారులకు విజయనగరంలో భోజనాలు పెట్టి పార్వతీపురం పంపించే ఏర్పాట్లు చేశారు. స్వాతంత్ర్యానంతరం వీరు ఒడిశాలో రైల్వే ఉద్యోగిగా పని చేశారు.

గాంధేయ జీవన మార్గం ఎంచుకున్న విశ్వనాథంగారు నవంబరు 18, 2021న రాయగడ లో కన్నుమూశారు.

శ్రీ జి. కన్నాజీరావు

నవరంగపూర్, కోరాపుట్ జిల్లా

నవరంగాపూర్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కొంతకాలం సేవలు అందించారు. జాతీయోద్యమం వివిధ దశలలో అన్నాజీరావు పాల్గొన్నారు. నవరంగపూర్ ప్రాంతంలో సహాయ నిరాకరణోద్యమంలో ప్రజలను సంఘటితం చేయడంలో వీరి పాత్ర ఉన్నది. వ్యక్తిగత సత్యాగ్రహం చేశారు. 1942లో "భారత్ ఛోడో" (క్విట్ ఇండియా ఉద్యమంలో) ముందుండి నవరంగపూర్‌లో ఉద్యమం నడిపారు. ఈ సందర్భంగా బ్రిటీష్ వారి లాఠీ దెబ్బలకు వెనుకంజ వేచలేదు. అరెస్టు అయి నాలుగేళ్ళు జైలు జీవితం గడిపారు.

కోర్టు విధించిన జరిమానా చెల్లించక, మరికొంతకాలం జైలులో జీవితాన్ని గడుపుతాను తప్ప జరిమానా కట్టను అన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ సమాచారాన్ని పార్టీ కార్యకర్తలకు, ఉద్యమకారులకు సైకిల్స్ ద్వారా చేరవేయించేవారు. వారితో వారి కుమారుడు డాక్టర్ సూర్యారావు. ఇతర కుటుంబ సభ్యులు కూడా ఉద్యమంలో పాలుపంచుకు న్నారు.

శ్రీ ఈగజాల (అంగజాల) వెంకటేశ్వర్లు

కోరాపుట్

కోరాపుట్ జిల్లా వాసులు వీరిని కోరాపుట్ గాంధీ అని పిలుస్తారు. జాతీయోద్యమంలో పాల్గొని అనేక సార్లు జైలు పాలైన దేశభక్తులు. వీరికి వి.వి. గిరి, ఆచార్య రంగా మొదలగు జాతీయ నాయకులతో సంబంధం ఉండేది.

శ్రీ గోపాలరావు పట్నాయక్

కాట్పాడు

జయపురం సమీపానగల కొట్పాడు వీరి స్వస్థలం.

స్వాతంత్ర్యోద్యమంలో శ్రీ గోపాలరావు పట్నాయక్ ఉద్యమంలో నాటి కమ్యూనిస్టు కార్యకర్తలతో కలిసి పనిచేశారు. అనేకసార్లు జైలుకి వెళ్ళిన చరిత్ర వీరిది.

శ్రీ శివ ప్రసాద్ ఆచారి

కోరాపుట్

స్వాతంత్ర్య సమరయోధులపై ఆంక్షలు విధించిన సందర్భంలో జాతీయ నాయకుల సందేశాలను జిల్లా నలుమూలల ఉద్యమకారులకు చేరవేసేవారు. అంతేకాకుండా బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రచార పత్రాలు ముద్రించి ప్రజలకి పంచి, ఆ విధంగా ప్రజలను చైతన్యవంతులను చేసేవారు. వీరిని బ్రిటీషు ప్రభుత్వం గుర్తించి 1943 సెప్టెంబర్ 1వ తేదీన అరెస్ట్ చేసి జైలుకి పంపారు. కోరాఫుట్ జైలులో 8 నెలలు కారాగారశిక్ష అనుభవించారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత శివప్రసాద్ అతి సామాన్యమైన జీవనం గడిపారు.

తామ్రపత్ర గ్రహీత శ్రీ జమ్ముల శ్రీరంగం

తండ్రి: జమ్ముల లోకనాధం
వృత్తి: బంగారం వ్యాపారం

వీరికి యుక్తవయసు వచ్చేసరికి బరంపురంలో జాతీయోద్యమం జరుగుతూ ఉండేది. ప్రాచీన గ్రంథాలయం ఆంధ్రభాషాభివర్ధనీ సమాజానికి, ఎంతో మంది దేశనాయకులు వచ్చారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఆచార్య రంగా, సురేంద్రనాథ బెనర్జీ, నెహ్రూ, గాంధీ వంటి వారు వచ్చి ఉపన్యాసాలు ఇచ్చి దేశభక్తిని ప్రబోధించారు. అలాంటి వారి ప్రభావం శ్రీరంగం గారి మీద పడింది.

1930లో వీరు చారిత్రాత్మక నౌపడా ఉప్పుసత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించింది పండిత ఉన్నవ రామలింగం పంతులు. బరంపురం, పర్లాకిమిడి, గోపాలపురం తదితర ప్రాంతాలకు చెందిన ఉద్యమ నాయకులందరినీ-నౌపడాలో అరెస్టు చేశారు. ఆ బృందంలో వీరు ఉన్నారు. శ్రీరంగం గారిని మొదట టెక్కలి (శ్రీకాకుళం జిల్లా) జైలుకి తరలించారు. పిమ్మట సెంట్రల్ జైలు, బళ్ళారికి తరలించారు. రెండు నెలలు తర్వాత జైలు నుంచి విడుదల అయ్యాక కూడా జాతియోద్యమం వివిధ దశలలో వీరు పాల్గొన్నారు. కఠినమైన శిక్షలకు ఏనాడూ భయపడలేదు.

ఖాదీ అమ్మకం, పేదలకు అన్నదానం, సంఘసేవ కడవరకూ చేస్తూ వచ్చారు.

బరంపురం కన్యకా పరమేశ్వరి దేవాలయం, ట్రస్టీగా మంచి పేరు సంపాదించుకున్నారు.

ఈ దేశభక్తుని భారత ప్రభుత్వం తామ్రపత్రంతో సత్కరించింది.

అసమాన త్యాగధనుడు శ్రీ పోకల సత్యనారాయణ

(1902-1970)

జననం: 1902
కార్యస్థానం: పర్లాకిమిడి, బరంపురం

గాంధీజీ పిలుపు నందుకుని స్వాతంత్ర్యోద్య మంలో ప్రవేశించారు. పర్లాకిమిడిలో వారి ఇంట్లో ప్రతి రోజూ రాట్నం వడికేవారు. సతీమని తారమ్మ సమధిక ఉత్సాహంతో కలిసి పని చేశారు. ప్రతిరోజూ ఇంట్లో జాతీయజెండా ఎగురవేసేవారు. ప్రముఖ నాయకులు శ్రీ వి.వి.గిరి. శ్రీ గౌతు లచ్చన్న, జాతీయోద్యమ కాలంలో ఏడుసార్లు అరెస్టు అయి మొత్తంగా పద్నాలుగు సంవత్సరాలు కారాగారంలో గడిపారు.

సిసలైన గాంధేయవాది:

జైలు జీవితం నుంచి విడుదలైన ప్రతిసారీమళ్ళీ ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయటం, అందుకు ప్రభుత్వం ఆయనని జరిమానా చెల్లించమని ఆదేశించటం జరిగేది. జరిమానా చెల్లించటానికి సొమ్ము లేకుంటే ఇల్లు జప్తు చేసింది. ఒకమారు పోలీసు అధికారి ఆయనను గంటసేపు కొట్టి పడిపోయాడట! అప్పుడు సత్యనారాయణగారు అతడికి నీళ్లు ఇచ్చి సేద తీర్చారట!

భారతదేశంలో వివిధ ప్రదేశాలలో, ఉద్యమాలలో పాల్గొన్న చరిత్ర సత్యనారాయణగారిది. సత్యనారాయణ దండి సత్యాగ్రహంలో పాల్గొన్నారు.ఒకమారు బళ్ళారి వెళ్ళి సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ మహాసభలలో పాల్గొనటానికి వీరు కాలినడకన లాహోరు వెళ్ళారు.

1927లో గాంధీజీ పర్లాకిమిడి రాజువీధిలోని వీరి ఇంటికి వచ్చి ఖద్దరు దుకాణం ప్రారంభించారు. సత్యనారాయణగారిని పర్లాకిమిడిలో చిన్నగాంధీ అని పిలిచేవారు. దేశం కోసం సర్వస్వం త్యాగం చేసిన మహనీయులు ఈ దంపతులు. సత్యనారాయణ గారు 1970లో కన్నుమూశారు.

శ్రీ పూడిపెద్ది సూర్యనారాయణ

(1880-1955)

తండ్రి: పూడిపెద్ది చినవెంకన్న పంతులు
తల్లి:గంగా భవాని
భార్య: భద్రమ్మ
స్వస్థలం: బరంపురం.

సత్యం డాక్టర్ ప్రసిద్ధి చెందిన పూడిపెద్ది సత్యనారాయణగారి అన్నగారు.స్థానిక కళ్ళి కోట కాలేజియేట్ స్కూల్ ఉపాధ్యాయునిగా సేవలందిం చారు. కుటుంబ పెద్దగా ఆయన ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ప్రతిదినం 'దుర' జమీందారు పిల్లలకు చదువు చెప్పటానికి పాత బరంపురం నుండి 'దుర' వెళ్ళేవారు. నాడు జమీందారు వారికి ఇచ్చిన జీతం నెలకి ఒక్క రూపాయి, బస్తా బియ్యం.

జాతీయోద్యమ ప్రభావం:

గాంధీజీ ఆశయాలకు ప్రభావితమైన కుటుంబం వీరిది. పట్టణంలో నెలకొల్పిన ఆంధ్రభాషాభివర్ధనీ సమాజ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమం వివిధ దశలలో పాల్గొన్న ఉదాత్త చరితులు.

ఒడిశా ప్రభుత్వంలో తొలి తెలుగు మహిళా ఉపసభాపతి శ్రీమతి ఆదుర్తి లక్ష్మీబాయి

(1899-1986)

పదవి కొందరికి అలంకారమైతే ఆ పదవికే అలంకారంగా భాసిస్తారు కొందరు. ఒరిస్సా శాసన సభలో ఉపసభాపతిగా సేవలందించిన శ్రీమతి ఆదుర్తి లక్ష్మీబాయి రెండో కోవలోకి వస్తారు. బరంపురంలో జరిగిన నాటి స్వాతంత్ర్యోద్యమ సంరంభంలో ఉప్పొంగిన మహిళా చైతన్యానికి ప్రతీక ఆమె. ఒరిస్సా ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకి ఉచిత విద్యావిధాన చట్టం ఆమె చొరవతోనే రూపుదిద్దుకుంది. లక్ష్మీబాయి వరహాగిరి వారింటి ఆడబడుచు. భారత రాష్ట్రపతి వి.వి.గిరి గారి సోదరి.

తొలి అడుగులు:

1899 అక్టోబర్ 12వ తేదీన బరంపురంలో వెంకటసుబ్బమ్మ, వరహాగిరి వెంకట జోగయ్య పుణ్య దంపతులకు జన్మించారు. జోగయ్యగారు ప్రముఖ న్యాయవాది. ఢిల్లీ శాసనసభకు, చెన్నపట్టణం శాసనసభకు రెండు సార్లు ఎన్నికై, ఎం.ఎల్.ఏగా, ఎం.ఎల్.సిగా సేవలందించారు. పట్టణంలో ప్రముఖులైనందున తరచు అనేక మంది పెద్దలు వారింటికి వస్తూ ఉండేవారు. మహాత్మాగాంధీ, జవహర్లాల్ నెహ్రూ, బాబూ రాజేంద్రప్రసాద్, మీరాబెన్ వంటి నాయకులను ఆమె చిన్ననాడే చూశారు. అమ్మ సుబ్బమ్మగారు స్థానిక ఆంధ్ర మహిళా సమాజం తొలి కార్యదర్శిగా, అధ్యక్షురాలిగా, కార్యవర్గ సభ్యురాలిగా సేవలందించారు. వీరి ఇంట్లో మధ్యాహ్న సమయాలు చైతన్యపూరితమైన చర్చలతో ప్రతిధ్వనించేవి. వీరి అమ్మగారూ. బంధువర్గంలోని మహిళలు, పెద్ద తల్లులూ, పినతల్లులూ, అక్కలూ మొదలైనవారంతా ఒక చోట కూడి స్త్రీల సమస్యలను గురించి చర్చించేవారు. ఈ గృహ వాతావరణమే ఆమెని ఆదర్శ మహిళగా తీర్చిదిద్దినదటంలో అతిశయోక్తి లేదు. లక్ష్మీబాయి బరంపురం, కాశీ, కలకత్తా నగరాలలో చదువుకున్నారు. రాజమండ్రి వాస్తవ్యులు భర్త ఆదుర్తి వేంకటేశ్వరరావు చిన్ననాడే మరణించటంతో పుట్టినింటికి తిరిగివచ్చిన లక్ష్మీబాయి ప్రజాసేవకు అంకితమయ్యారు. స్వాతంత్ర్యోద్యమం వివిధ దశలలో జైలు కెళ్లారు.

జైలు జీవితానుభవాలు:

'కొంత కష్టపడ్డా పదిమందితో చావు పెళ్లితో సమానంలాగ సరదాగానే గడిచింది' అనే ఆట లక్ష్మీబాయి గారి వ్యక్తిత్వానికి అద్దంపడుతుంది. అది 1932, జనవరి 18వ తేదీ. లక్ష్మీబాయి బరంపురంలో విదేశవస్త్ర విక్రయ దుకాణం దగ్గర పికెటింగ్ చేస్తుండగా పోలీసు సిబ్బంది అరెస్టు చేశారు. పిమ్మట ఆమెకు 11/2 సంవత్సరాలు జైలు శిక్ష విధించి, రాయవేలూరు మహిళా జైలుకు తరలించారు. కాళ్లు చాపుకుని, పడుకోవటానికి కూడా వీలులేని ఇరుకైన గదిలో ఆమె ఇతురాలతో ఉండాల్సి వచ్చింది. నీళ్లు తాగటానికి ఒక అల్యూమినియమ్ మగ్గు, భోజనం చేయటానికి ఒక అల్యూమినియమ్ పళ్లెం, రాత్రి ఒంటేలు పోసుకోవడానికి ఒక రేకు డబ్బా, ఇలాంటి దుర్భరస్థితిలో 'సి' క్లాస్ ఖైదీగా 1 1/2 సం॥ గడిపారు. జైలులో ఆమె స్టోర్‌రూమ్‌కి వెళ్లి రేషన్ సరిగా తూయించి పుచ్చుకుని అందరికీ పంచేపని, ఖైదీల రికార్డులని ఆంగ్లంలో నుంచి తెలుగులోకి అనువదించే పని చేసేవారు. జైలులో వంటలు ముగ్గురు, ముగ్గురు కలిపి వంతులువారిగా వండుకునేవారు. జైలులో లక్ష్మీబాయి గారితో పాటు మార్గరేట్ కజిన్సు, కుట్టి అమ్మాళ్, పొణకా కనకమ్మ, ముత్తు లక్ష్మీరెడ్డి, రుక్మిణమ్మ, ములిపూరి చుక్కమ్మ గార్లు ఉండేవారు. మార్గరేట్ కజిన్సు వారి దేశపు కబుర్లు చెప్పేది. తోటమర్తి కనకమ్మగారు ఎనభై ఏళ్ల వృద్ధురాలు. 6 సం॥లకు లాకప్‌లోకి వెళ్లకుండా అటూ ఇటూ పరుగెత్తుతూ వార్డెన్‌ను అల్లరిపెట్టేవారు. అంబుజమ్మ గారు 'ఎ' క్లాస్ ఖైదీ. ఆమె తన గదిలో రామనవమి పూజచేసి పళ్లు అందరికీ పంచిపెట్టేవారు. ఇక క్విట్ ఇండియా ఉద్యమంలో లక్ష్మీబాయి మూడుసార్లు జైలుశిక్ష కటకం జైలులో అనుభవించారు. మూడోసారి ఒకనెల ముందుగా విడుదల అయ్యారు. బ్రిటీష్ ప్రభుత్వం స్వాతంత్ర్యం ఇస్తామని ప్రకటించి- రాజకీయ ఖైదీల సందర్శి విడుదల జేయమని అధికారులకు ఆదేశాలిచ్చింది. కటకం జైలులో ఆమె సరళాదేవితోనూ, గదాధర్ దత్తుగారి భార్యతోనూ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకురాలిగా సేవలు: ఉపసభాపతిగా ఎన్నిక:

గంజాం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా, బరంపురం పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా 1930-40 కాలంలో విలువైన సేవలందించారు. కాంగ్రెస్ ప్రొవిన్షియల్ కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. 1937లో జరిగిన ఎన్నికలలో బరంపురం నుంచి మహిళల స్థానానికి పోటీలేకుండా ఎన్నికయ్యారు. ఆ పదవిలో 1953 వరకూ కొనసాగారు. శాసనసభ్యురాలిగా ఉన్న ఆమె ఉ

భక్తి,సామాజిక సందేశాత్మక శతక త్రయము



ప్రతులకు :
మఠం సాంబమూర్తి
8-5-552/ఎ/ఎ/1,
పోచమ్మ వీధి, కొత్త రాంపూర్,
కరీంనగర్. సెల్:9542020470

పుస్తక సమీక్ష

మఠం సాంబమూర్తి గారు చదువుకునే రోజుల్లోనే వచన కవితలు రాసేవారు. ఆ తర్వాత ఫెర్టిలైజర్ సిటీ కార్పొరేషన్ లో పనిచేస్తున్నప్పుడు అక్కడి గ్రంథాలయంలోని పుస్తకాలను చదవడం, సాహిత్యం పట్ల అభిలాషను పెంచుకోవడం, సమా జాన్ని ఆకలింపు చేసుకుని వచన కవితలు రాయడం ప్రారంభించారు. పద్యం రాయాలన్న ఆలోచనకు రూపం ఇచ్చింది వారి గురువుగారైన తోపెల్ల బాల సుబ్రహ్మణ్య శర్మ గారు. వారి శిక్షణలో చందస్సును ఆకలింపు చేసుకొని ముచ్చటగా మూడు శతకాలను **"శతకత్రయము"** పేర మనకు అందించారు. ఇందులో ఉన్నవి పార్వతీపతి శతకము, సాంబమూర్తి శతకము, మగువ శతకము. సాంబమూర్తి శతకాన్ని పద్య రచనలు నేర్పిన గురువుగారికి అంకితం ఇవ్వడం వారి గురుభక్తికి నిదర్శనం. శతకత్రయం వున్నకానికి తోపెల్ల బాలసుబ్రహ్మణ్యశర్మగారు ముందుమాట నందించడం ఈ పుస్తకానికి మరింత శోభను ఇచ్చింది.కవి తన స్వీయ పరిచయాన్ని పద్యాలలో అందించడం పద్య రచన పట్ల కవికున్న అభిమానాన్ని తెలియచేస్తుంది.

"పార్వతీ పతి కృప పరమ శుభము" మకుటం తో రచించిన పార్వతీపతి శతకంలో భోళాశంకరుడిని కొలిస్తే చాలు కొంగు బంగారమై పిలిచేవాడు, అసురుడైనా సరే కోరిన వరాలనిచ్చే భక్తి వరదుడు అని పేర్కొన్నారు.

"ఎద్దునెక్కి తిరిగి యెల్లలోకాలలో
నడిగినట్టి వరము నసురుడైన
తనను కొలిచేనేని తన్మయమునిచ్చు" శివుని లింగరూపుడైన జంగమయ్యగా తెలుపుతూ శుభాలనొసగే శూలపాణియని, పట్టుబట్టలతనికి పడవని, ముక్తినొసగు వాడు ముక్కంటియని,ఆద్యంత రహితుడు,పాపహరుడు,ఫాలలోచనుడు, చిద్రూపుడు, కేదారనాథుడు, గంగాధరుడు కాలకంఠు డుయని శివుని విభిన్న రూపాలను తలచుకున్నాడు.

"హరుని మదిని నిలిపి హరహరాయనినంత
కరిగి పోవునయ్య కంటకములు
హరిని మదిని నిలిపి హారతులీయుమం"టూ భక్తులకు మంచి మార్గాన్ని ఉపదేశించాడు.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు పుష్పం, పత్రం, ఫలం,తోయం వీటిలో ఏ ఒక్క దానితో పూజ చేసినా ఆ పార్వతీపతి కృప లభించునని ఎరుక పరిచాడు. చివరగా శతక పద్యములను "శంభుని దయతోడ పూర్తిచేసుకుంటి స్ఫూర్తినింప" అంటూ ఈ శతకాన్ని తన చేత ఆ శివుడే రాయించుకున్నాడని, ఆయన దయ వల్లనే ఈ శతకాన్ని పూర్తి చేయగలిగానని భక్తితో విన్నవించుకున్నాడు.

సామాజిక హితం కోరి రాసిన శతకము **"సాంబమూర్తి శతకము"**. నేటి సామాజిక స్థితిగతులకు అద్దం పడుతూ నిలిచిన ఈ శతకము, తన పేరు సార్థకం అయ్యేలా "సాంబమూర్తి మాట సద్ది మూట" మకుటంతో అందించిన ఈ శతకములోని పద్యాలన్ని కూడా మానవులకు హితం చేకూర్చేవే.

కలిమి గలిగినంత గర్వింపగాబోకు
లేవు చెలిమిలోన లేమి కలిమి

కలిమి కన్నా బలము చెలిమి అందించురా'' ధనమున్నదని గర్వించబోకు నేడున్న ధనం రేపు ఉండకపోవచ్చు. కలిమి లేముల గురించి ఆలోచించకూడదు. అందులో మిత్రుత్వంలో కలిమిలేములు చూడకూడదు. ధనం కన్నా స్నేహం గొప్పది అన్న భావనని చక్కగా ఈ పద్యం ద్వారా అందించారు.

"కాకి తినును తోడి కాకుల తోడను
కాకులన్నీ చేరు కాకి చావ
కాకి కున్న బుద్ధి కనరాదు జనులకు"

పశుపక్ష్యాదులలో ఉన్న ఐకమత్యము జనులలో లేకపోవడాన్ని గుర్తు చేస్తూ ఐకమత్యమే మహాబలం అన్న నానుడిని ఈ పద్యంలో ప్రకటించారు.

"నీరు లేని వేల నీరజాక్షుండైన
తళజాల గలదే తనువు నిలుప
నీరమొకటే ధరణి నిలుపును ప్రాణాలు" జలం యొక్క విలువని పొదుపు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పాడు ఈ పద్యములో. ఇలా సాంబమూర్తి శతకంలో ప్రతి పద్యము ఒక నీతిని, ఒక సందేశాన్ని, హితం కోరే మంచి మాటని తెలియజేస్తున్నాయి.

మూడవదైన మగువ శతకము మహిళలను గౌరవిస్తూ, వారి శక్తియుక్తుల్ని మహిళల గొప్పతనాన్ని, కొన్ని సందర్భాల్లో స్త్రీలు ఏ విధంగా నడుచుకోవాలో తెలియజేస్తూ సాగింది. మగువలకు హితాన్ని చేకూర్చే విధంగా కూర్చిన ఈ శతకము మకుటము "మంచి మాట వినుడు మగువలార"

"కట్టుకున్న వాని కరమును వదలక
కాదు చేరువరకు కలిసి ఉండు
కలతలెన్నియున్న కన్నీళ్ళు వచ్చిన"

కష్టసుఖాలలో తోడునీడగా కలకాలం కలిసి ఉండాలని భార్యాభర్తలకు చక్కని సందేశాన్నిచ్చిన పద్యం.

ఇంకా మగువ శతకములో మగువలకు అందించిన మంచి మాటలు...

"ఇంటి గుట్టుకాసుమిల్లాలిగా నీవు"
"కొత్త కోరికలను కొంగున కట్టకు"
"విచ్చలవిడి బ్రతుకు విబుధులు మెచ్చరు"
"ప్యాంటు షర్టు తొడిగి ఫ్యాషననగరాదు
చిత్తముంచకుండా చేయబోకు పనులు"

భారతీయ వస్త్రధారణ గురించి, భార్యా భర్తలు బండిని నడుపు కాడెడ్లవలె కలిసి నడవాలని,కురుల గురించి తెలుపుతూ వాటిని విడిగ వదలరాదని, స్త్రీలు తప్పనిసరిగా చదువుకోవాలని ఇలా మరెన్నో సుద్దులు అందించిన శతకము మగువ శతకము.

మఠం సాంబమూర్తి గారు ఒకే పుస్తకంలో అటు భక్తిని అటు సామాజిక హితాన్ని కోరుతూ అందించిన శతకత్రయము ప్రతి ఒక్కరు చదివి ఆకలింపు చేసుకొని అనుసరించాలని కోరుకుందాం.

-డా.వైరాగ్యం ప్రభాకర్
9014559059

కవితార్చన

అడ్మిన్: **డా॥రాధాకుసుమ**
సెల్:99892 41319
"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
-సంపాదకులు

వానలో కోణాలు

చినుకులు చేరిన వీధుల్లో
కొత్త జననాల చప్పుళ్లు
గడ్డిపొరకల రూపంలో నేలపై పసి మెక్కలు
వేసవి ఘాటుకి గొంతెండి
నీరు త్రాగిన భూమి పొరలు
నిశబ్దపు ప్రకృతిలో ఉరుముల అల్లర్లు
నలుపైన చీకట్లో మెరుపుల వెలుతుర్లు
కానీ కనిపించే అందాలలో కనిపించని రూపం
పల్లె గుడిసెల్లో మట్టి గోడల కన్నీళ్లు
పట్నం మేడల్లో నీటి వరదలు
చేరువుల దాడికి బలైన గ్రామాలు
వాగుల వేగంకి విరిగిన వంతెనలు
కనిపించని కోణంలో కాటేస్తున్న కష్టాలని వదిలి
కళ్లు మూసుకొని కాలక్షేపం చేస్తున్న ప్రభుత్వాలు
ఏవరిదీ ద్రోహం.. ఏవరికీ శాపం
శాసనాలు ముట్టుకోని స్వార్థపరుడా నాయకుడు..?
ఎవరిస్తారీ ప్రశ్నకి సమాధానాలు

-మామిడి అక్షిత
90591 63244

లోకం పోకడ

ఏదైనా కొత్త వస్తువులు గాని
ఏదైనా కొత్త కట్టడం గాని
చూసినప్పుడు మనుషులు
ఎగబడి వింతగా చూస్తారు.
ఇలాంటి సందర్భంలోనే
మన పూర్వీకులు వాడినదే
ఈ సామెత
క్రొత్తొక వింత-పాతొక రోత
అను సామెత వాడుకలోనికి
వచ్చి యుండవచ్చు.
మనిషి తత్వం కొత్తను చూడడం
వింతను మళ్ళీ మళ్ళీ చూసి
ఆనందంగా జీవితం గడపడం
మనినిషికి నాటి నుండి అలవాటే.
మనుషులు బతకడానికి
అనేక విద్యలు నేర్చుతారు
కోటి విద్యలు కోటి కొరకే
అనే సామెత వాడుకోలోకి వచ్చింది.
ఏది చేసినా ఏమి చేసినా
పొట్ట కొరకే అనే అర్థములో
ఈ సామెత వాడుకలోనికి
వచ్చి ఉంటుందని చెప్పొచ్చు.
ఏది చేసినా సాపాటు కొరకే
ఎంత కష్టపడినా పొట్టకోసమే
కూడు గుడ్డ గూడు ఇవి మూడు
మనినిషికి తప్పక కావలెనుగా.

-అక్కి నర్సింలు గౌడ్
99126 59965

సంస్కృతికి రారాజులు

మట్టితో మమేకమై మట్టి మనిషి
మాటలకన్నా గొప్పది అతని కౌశలం
పొట్టను తిప్పిన పేదలో పుట్టిన
పానపాత్రలు పల్లెకు పునాదులు!.
కత్తెర చేతిలో కళలే కళకళలు
కంపించె మొహాలపై కొత్త రూపాలు!
బట్టల మీద కథలు గీయు చేతులు
వర్ణాల వానగా వెలుగుల కలలు!.
సముద్రపు ఒడిలో
సమీరణమవుతూ వల వేసే..
వేటకు జీవం పోసె యాతం!.
చిత్త చైతన్యమే అతని నగ
ముంగురాలు నగల మిలమిలలో
మన సంస్కృతిరాగాలు!
చక్రం తిప్పుతూ చెక్కిన
చక్రవ్యూహాలు చిన్నదానిలో పెద్ద
జీవన సందేశాలు!.
తాటి ఎక్కిన తాతలునాటి
గుళికలతో తీరికిలేని జీవితం తీపి
తాటి రుచిలో!.
కళలు కష్టాల్లో కరిగిన ఆత్మలు
జీవితాన్ని ఊహలుగా మలచిన
హస్తాలు!
చిన్నవైనా గొప్పవైనా వృత్తులు
పల్లెలో పెరిగిన పెద్ద జీవితాలు..
వారే మన సంస్కృతికి రారాజులు..!

-ఓగిరాల గాయత్రి
9492308725.

సమావేశాలు

సాంఘిక అసమానతలపై
పేద ధనిక మధ్య జరుగుతున్న సంఘర్షణలపై
లోకానికి సమున్నత న్యాయంపై
సామాజిక సమావేశాలు జరగటం హర్షనీయం
ఈ చర్చలు అభివృద్ధికి సోపానాలు
రవి కాంచని చోట కవి గాంచు నన్నట్లు
కవులు సృజించు అంశాలు అక్షర దీపాలు వెలుగుతాయి
ఈ లోకం అంతా ఒకచోట చేరితే హాస్యోక్తులకి ఏమి తక్కువ
నవ్వుల పూలు పూయించెదరు
నవరస భావాలు ఒలికించెదరు
కవితా రీతులు కవనం చేసి
క్రత పద తోరణాలు ఆవిష్కరించెదరు
సంస్కృతుల వారు విభిన్న ధోరణిని
సంధించుకుంటూ వివరించుకుంటారు
ఒక అద్భుత మేలవింపు కవుల సంగమం
సూర్యుని దించే వాడి వేడి కవితలు
నా మామ వెన్నెలను పరిచి చల్లని కవితలు
సాహిత్య ఇస్తా గోష్టి ఎంతో అవసరం
కవులందరూ సభ్య సమాజాన్ని
సన్మార్గంలో నడిపించాలి

-డాక్టర్ ఉప్పు జయ భారతి
+91 97040 35050

కవి సమ్మేళనం

కవుల సమాగమం త్రివేణీ సంగమంలా....
కవితా గానాలు రస ఝరీ ప్రవాహంలా....
శ్రోతల కరతాళ ధ్వనులు చిరు ముప్వల నాదంలా...
అష్ట దిగ్గజాలతో అలరారే భువన విజయంలా...
సాహితీ కన్యక నాట్యం చేసే రంగస్థలంలా...
భాసిల్లే కవి సమ్మేళనాలు వాగ్దేవి పీఠంలా....
భాషా సాహిత్య మేథో మథనాలు...
కవి గాయక వైతాళికుల సంరంభాలు..
సాహితీ ఉద్దండుల గౌరవ సన్మానాల సంబరాలు...
ప్రఖ్యాత కవులు ప్రసంగాలతో చూపే మార్గదర్శనం...
వర్ధమాన కవుల కవితా ప్రౌఢి ప్రదర్శనం...
చిన్నా పెద్ద సాహితీ వేత్తల ఆనంద సందర్శనం...
కవి సమ్మేళనాలు ఇచ్చు కవులకు గుర్తింపు...
కవితా పుష్ప సౌరభాల వ్యాపింపు..
సభాస్థలి అలరారు వాగీశ్వరీ దేవి నర్తింపు...

-జి మధు మురళి
97033 35534

నాటి కాలాన్ని వివరించే మేటి కథలు

"అతని సాయం కోరితే, ముఖం చాటేసిండు. కొన్నాళ్ళకు మా రూంకు వచ్చిండు. రాగానే సారీ చెప్పిండు. వీలుకాక రాలేకపోయానని చెప్పిండు. ఇంటికి వచ్చిండు. మాయమాటలు చెప్పిండు."

"కావల్సిన వారు ఓదార్చటానికి వస్తున్నరు. పోతున్నరు, రాజమణి శంకర్‌లు వాళ్ళను ఓదార్చుతున్నరు. వంటచేసి బతిమిలాడి తినుమంటున్నారు. వాళ్ళు కూడా కన్నీళ్ళు పెట్టుకుంటున్నరు"

విలక్షణమై, మరెవరూ అనుసరించ చలేని ఈ శైలి, కరీంనగర్ (తెలంగాణ) వాసి, కవి, కథకులు శ్రీ రేగులపాటి కిషన్‌రావుగారిది. 6 కథా సంపుటులు 4 నవలలు 13 కవితా సంకలనాలు, 2015 వరకు వెలయించి, పలు అవార్డులు పురస్కారాలు పొందిన రచయిత శ్రీ కిషన్‌రావు గారి కథనం ప్రత్యేకంగా ఉంటుంది. వేర్పాటు తెలంగాణ ఉద్యమం, ఆస్తులుతో పెరిగిన అంతస్తులతో బాంధవ్యాలు మరిచిన వారు, దొర లు, గడీలు దొరల దర్పం నిమ్నజా తుల వారిని ఈ తెలంగాణ దొరలు పెట్టే హింస నక్సలిజం, కష్టపడితే పైకి వస్తావు అనే మంచి సందేశం- వీరి కథల్లో కనిపిస్తాయి.

ఉండేది కరీంనగర్ టౌన్, కాని కిషన్‌రావుగారు బాల్యం పల్లెటూళ్ళ లో గడిపినట్టుంది. అందుకే వీరి కథల్లో వాగు నీళ్ళలో ఈత కొట్టటం, చెరువుకు నీళ్ళు తాగటానికి వచ్చిన దున్నపోతుల మీద ఎక్కి స్వారీ చేయటం, మే నెలలో ఎండలను లెక్క చేయకుండా కావలివాడు పడుకోవటం చూసి మామిడి తోటలో చొరబడి కాయలు తెంపుకోవటం కనిపిస్తుంది.

14 కథలున్న ఈ సంచికలో సింహభాగం పల్లెటూర్ల నేపథ్యం అవటం వల్ల నేటి యువతకు నాడు ఎట్లా ఉండేదో తెలుపుతుంది. 60 దాటిన వయోవృద్ధులను నాటి కాలానికి తీసుకు వెళ్ళి మనసుల్ని బాల్య స్మృతులతో పులకింపచేస్తాయి కథలు. నవ చైతన్యం, జ్ఞాన చైతన్యం ఉద్యమ చైతన్యం కలిగిస్తాయి.

వీరి కథల్లోని పాత్రలు "మనిషికి మనిషి తోడు కావాలి. మనిషి మంచి తనంతో బ్రతకాలి" (ఓదార్పునిచ్చిన మనిషి) ఏ కాలంలోనైనా ఏ ప్రాంతంలోనైనా దౌర్జన్య స్వభావం ఉన్నవాళ్ళు ఆధిపత్య స్వభావం ఉన్న వాళ్ళు అవకాశాల కోసం ఎదురు చూస్తుంటరు.

కనుక తెలివితేటలు పెంచు కుంటూ ఉండాలి" (నవ చైతన్యం) ఎవరో ఏదో అనుకుంటారని.. అంటారని బిడియపడుతూ కూర్చుంటే నువ్వు సాధించాలను కున్నది సాధించలేవు.

మామూలుగా బ్రతకడం ముఖ్యం కాదు" (జీవితమంటే ఇంతేనా?) లాంటి మంచి సందేశాలనిస్తాయి.

మన కిరీటాలు రాలి నేల మీద పడుతాయా.. (పే.50) అడవిలో చింతపలక కాయల ప్రసక్తి (పే.21) అటుకులు పోనికి వేయటం (24) కోమటి కనకయ్యను రమ్మని కాగితాలు (డాక్యుమెంట్స్) రాయించటం (35) చాకలోళ్ళు దొరల కచ్చురాల ముందు ఉరుకుతారు (36) మానెడు అడ్డెడు వడ్ల-కుంచెడు ఇరుస వడ్ల (37) లాంటి తెలంగాణ పదాల కమ్మదనం ఆస్వాదించగలము ఈ కథల్లో.

తెలంగాణ గ్రామీణ సౌందర్యాన్ని కన్నులకు కట్టించే ఈ రచయిత రచయిత్రి స్వర్ణలోక యాత్ర'', 'జ్ఞానోదయం' లాంటి హాస్య కథలతో తాను హాస్య రసం కూడా ప్రతిభాభావంతంగా పోషించగలనని నిరూపించుకున్నారు.

ప్రతులకు:
రేగులపాటి విజయలక్ష్మి
కవితానిలయం.
ఇ.నెం.10-1-436,
సంతోషినగర్, రాంనగర్,
కరీంనగర్-505 001.

- కూర చిదంబరం
సెల్: 8639338675

-డా॥రావి రంగారావు
9247581825

అంశం : సరిహద్దు ప్రజలు
పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు. 2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 21 కు మొత్తం 20 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 11 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

భరత వీరులు సరిహద్దు ప్రజలు

జవాన్లు కిసాన్లు కలిసే ఉంటా రక్కడ
అపాయము ఉపాయము కలసుంటా యక్కడ
తుపాకులు నాగళ్ళు కలిసే కవాతు చేస్తా యక్కడ
పచ్చని పైరుల నేలలో వెచ్చని రుధిరం పారుతుంది
పల్లె పదాలతో పాటు శతఘ్ని మోతలూ వినిపిస్తాయి
పంటను కోతల సమయంలో కోయాలో
యుద్ధం మొదలవుతుంది అని కోయాలో
తెలియదు ఆ దేశభక్తులైన కృషీవలులకి...
శత్రు సైనికుల జాడలు కనిపెట్టి తెలిపే
శిక్షణ ఎరుగని చారులు వాళ్ళు
పంటలనే కాదు ప్రాణాలను బలిపెడతారు
వీర జవానులకు నేస్తాలు వాళ్ళు
భూమాతకు ప్రియ పుత్రులు వాళ్ళు
సేవకు హద్దులెరుగని సరిహద్దు ప్రజలు
త్యాగాలకు వెనుదీయరు సరిహద్దు ప్రజలు

-అనుముల బదరీనారాయణ,

యోధులు

పొంచున్న రెండు భయాల మధ్య
కలలు కనాలి వాళ్ళు
కటి రెటీనా పట్టనంత ఉద్రిక్తతను
ఊపిరిలో ప్రసారం చేయాలి వాళ్ళు...
నేలను పంచిన అంచున ముళ్ల కంచెల్లా
నిలువెల్లా నెత్తురు నీడ లవ్వాలి వాళ్ళు
ఏ అపరాత్రో భళ్ళుమనే దగ్ధ సూర్యోదయాల్ని
ఏమైందో తెలియక పిక్కటిల్లుతున్న పగళ్ళని
అమోదించాలి వాళ్లు...
బతికిన మట్టి మీద బంధాన్ని
వదులు చేసుకోలేక దేశ పటం పొలిమేరలో
శత్రువుతో చిరునామా పంచుకుంటూ
భయం ఈనుతున్న మృత్యువును
ఏనాటికైనా సాధికారకంగా అంగీకరించే
ప్రకటిత యోధులు వాళ్ళు..

-ఆర్. వి.వి రాజా

గోల్డెన్ డోమ్

అవి సరిహద్దు రేఖలు కావు...
సరిహద్దు ప్రజల తలరాతలు.!
వారిని భయపెట్టే హర్రర్ సినిమాలు
నేటికీ పురుడు పోసుకోలేదు.!.
వాళ్ళు దేశానికి ప్రథమకవచాలు.!
మనసారా నిదురించుటకు అనర్హులు.!
వారిని చూసిపుట్టాయేమో
జీవిత భీమా పథకాలు.!.
వారికి జీవితం ఒక ముళ్ళపానుపు...
ఏ రోజుకారోజు జన్మ నెత్తుతారు.!
పరమవీరచక్రకు కడుదూరం వారు.!
అక్కడ చిరుగాలి ఎరుగదు స్వేచ్ఛను.!
కవ్వింపుల తూటాలు కొత్తేమి కాదు
అక్కడి ప్రహరీలకు.!.
వాళ్లకి ఓజోన్ పొర కన్నా
సైనిక పహారా ఎంతో ముఖ్యము.!
వారికి అసలైన ప్రాణ స్నేహితులు బంకర్లు...
హద్దులు దాటి నరమేధం
కాలు మోపేందుకు ముహూర్తాలు ఉండవు.!.
వారి చిరునామా కోసం చీకటి వెతుకదు ...
చీకటికి సుపరిచితమే వారి కదలికలు.!
మానవత్వం అనే గోల్డెన్ డోమ్ మాత్రమే సరిహద్దు ప్రజలను పీడ కలల నుండి కాపాడగలదు.!.
అత్యాధునిక ఆయుధ సంపత్తి
ఎన్నటికీ సంపద కాజాలదు.!
ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి
సకల జనులు.!

-లీలాకృష్ణ.

సరిహద్దులో హద్దు

సరిహద్దు ప్రజలు...
సమస్యకు అటూ ఇటూ బ్రతుకులు,
ఆ సమస్య... ఇటు పడినా...
ఈ సమస్య... అటు పడినా..
ఏ సమస్యకు చెందక నలిగిపోయే జీవులు,
ఈ మనుషుల మనసుకి హద్దుండదు
కానీ...
సరిహద్దు వీళ్ళ మనసుకి అడ్డుంటుంది,
వీళ్ళ సంస్కృతికి హద్దుండదు
కానీ....
సరిహద్దు వీరి స్వేచ్ఛకు అడ్డుగోడవుతుంది,
వీళ్ళ ప్రేమకు హద్దుండదు
కానీ....
సరిహద్దు వీరి బంధానికి
కన్నీటి రాత రాసేస్తుంది,
సరిహద్దు ఎప్పుడూ...
అనుమానాన్ని పోషిస్తుంది,
సరిహద్దు ఎప్పుడూ...
ఆదర్శాల్ని వెక్కిరిస్తుంది,
సరిహద్దు ఎప్పుడూ....
నిజాలను పరిగెత్తిస్తుంది,
సరిహద్దు ఎప్పుడూ...
నిన్నటిలోనే బ్రతికిస్తుంది,
అందుకే...
సరిహద్దు ప్రజలు...
సహజత్వానికి దూరపు బంధువులు
హింసోన్మాదపు తొలి బాధితులు
తన వారి నమ్మకానికే అంటరాని లోకులు
తమ శ్వాసని తామే తీసుకోలేని అనాథలు.

-శ్రీ అరుణంశ్రీనివాస్

అర్థం లేని చావులు

ఇసుక రేణువంత
విషపు తలంపు లేని నేను
ఏ పడతి కడుపులో ఏ పుడమి ఒడిలో
పురుడు పోసుకుంటానో తెలియని నేను
ఏ పాపము చేసియుంటినో ఎరుంగనైతి
సరిహద్దు ప్రాంతపు ప్రజలనైతి,
కొత్త జంటకి భయం
ముద్దు ముచ్చటలాడేటప్పుడు
ఏ గుండు వచ్చి గుండెను
ముద్దాడుతుందో నని
తల్లికి భయం
అమితమైన ప్రేమను బిడ్డకు పంచేందుకు
ఏ తాలిబన్ వచ్చి తన బిడ్డను
ఒంటరి చేస్తాడోనని.
విద్యార్థికి భయం
రాస్తున్నప్పుడు పేజీ
ఎర్ర సిరా ఒలికి ఎరుపెక్కుతుందేమో నని
డాక్టర్కి భయం
కుట్లు వేస్తున్నప్పుడు
ఏ ఉన్మాది వచ్చి పోట్లు పొడుస్తాడోనని.
ఏ పండగైన పబ్బమైనా
భయం గుప్పిట్లలో తుపాకుల చప్పట్లలో
నిదురలోనూ కలవరపాటు
నీడలోనూ గగుర్పాటు
ఇదే సరిహద్దు ప్రజల గ్రహపాటు.
తలంపుకైనా నోచుకోని త్యాగధనులం మేము
శిక్షణ తెలియని పోరాట యోధులం మేము
ఓ పాలకుల్లారా
మాకు శిక్షణనిచ్చి
సరిహద్దు సిపాయిలు నైనా చేయండి
మా చావుకు ఒక అర్థాన్నివ్వండి

-రాజ్ తొర్లపాటి...

వచన కవితలు

ఎక్కువ లైకులు

ఏ అపార్టమెంట్ లో వాకిలి ముందు వేస్తున్న
ముగ్గు గీత,
పొరబాటున సరిహద్దు గీత దాటితే
సూర్యకాంతము , ఛాయాదేవుల ఆత్మలు
పరకాయ ప్రవేశము చేస్తాయి...
ప్రహరీ గోడపై ఆరవేసిన బట్టలలో నుంచి
జార బోయే నీటి బొట్లు
ప్రక్క వారి స్థలంలో పడతామేమో అని వణుకతూ
చుట్టూ కలియ చూస్తాయి...
నేతి ఘుమఘుమ తాళింపు
ఒక ఫ్లాట్ లో ఆస్వాదించిన వాయు దేవుడు
ఒక అడుగు అవతలకు వేసి
అల్లము వెల్లుల్లి వాసనలు పీలుస్తూ ఉంటాడు.
ప్రకటనల సమయంలో టీ వి లో సౌండ్
పొరబాటున ఒక గడప దాటితే
ఎదురింట్లో ఉన్న డి జే లు
ఒక్కసారిగా నోరు తెరుస్తాయి .
వాసు దేవా అని గోడ ఇవతల ప్రజలు
భజనలు చేస్తే
ఏసు రావా అని
గీత అవతల వారు గొంతులెత్తుతారు...
ప్రక్క వారి గోడ ప్రక్క నుంచి తన ఇంట్లోకి
నల్లా పైపు వస్తే ఒప్పు అన్న మది
వారి ఏసి ఔట్ డోర్ యూనిట్ నుంచి
నీటి చుక్కలిటు పడితే తప్పు అంటుంది.
చిరునవ్వు చిందిస్తూ
చిన్నారి పాప తెలియక సరిహద్దు కంచె దాటితే
అవతల నుంచి వంద వేళ్ళు
తుపాకుల ట్రిగ్గర పైకి రయ్యని చేరుతాయి.
కంచె ఇవతల అబ్బాయి
కంచె అవతల అమ్మాయికి
గాల్లో ఓ కిస్ ఇస్తే తుపాకి బులెట్ బుస్సు మని
బార్డర్ దాటుతుంది.
ఏడాది కొక మారు నరక చతుర్దశిని
దేశములోని ప్రజలు జరుపుకొంటే
సరిహద్దు ప్రజలు మాత్రము రోజు
నరికే చతుర్దశిని జరుపు కొంటుంటారు.
దేశములోని ప్రజలు ఖర్చుచేసి
లక్ష్మీ అవుట్ల ధ్వనులు వింటూంటే
సరిహద్దు ప్రజలు పైసా ఖర్చు పెట్టకుండా
బాంబుల శబ్దాలు వింటుంటారు.
దేశ ప్రజల ఇళ్ళల్లో ఉన్న
నేల మాళిగలు పణములను దాచితే
సరిహద్దు ప్రజలు ఇళ్ల నేల మాళిగలు
ప్రాణములను దాచుతాయి.
యుద్ధ మేఘాలు కమ్మితే,
నింగిలో వెలుగులు చూపే జాబిలి సైతము
సరిహద్దు ప్రజల ఇళ్లపై
తన వెలుగులు పడనీయక
ముఖము దాట వేస్తుంది.
కొవ్వొత్తులు లాంతర్లు
ఏమి ఊసులు చెబుతాయా విందామని ఫిరంగులు
ఉవ్వెత్తున పై కెగసి చొరబడలేక
గోడలకు గాట్లు పెట్టి భంగపడి రోదిస్తాయి
"ఏ నిముషానికి ఏమి జరుగునో' అనే
ఘంటసాల వారి పాట
సరిహద్దు ప్రజలలో నిత్యము నానుతూ
ఎక్కువ లైకులు పొందుతూ ఉంటుంది

-పూసపాటి కృష్ణ సూర్య కుమార్

సరిహద్దు ప్రజలు

అడకత్తెర బ్రతుకులండి
ప్రతినిత్యం పోరులండి..
పాముకప్ప లాటలండి
ముంచుకొచ్చె ముప్పులండి.
చీమచిటుకు మన్నదంటె
తుపాకీల మోతలండి..
ఏవైపున మొదలైనా
ఎరలుగా మాబ్రతుకులండి
బర్రె కంచె దాటినదా
బలిదానం కోరుతుంది.
చిన్నపెద్ద తేడ లేక
తూటాలే దేహమంత....
పొరబాటున అడుగిడినా
బందీలై పోతాము.....
తిరిగిరాని బ్రతుకులే
తెల్లరితే కథలు కథలు
ఇరువురికి అనుమానం
చూపబోరు అభిమానం..
ఒంటి కాలు వనవాసం
అడుగడుగున పరిహాసం
అర్ధ రాత్రి పోరులతో
అరచేతిలో ప్రాణాలు...
ఒక్కొక్కరు ఒరిగి పోయే..
కారణాలు తెలియపాయే..
వదలలేము ఉండలేము
సరిహద్దున సంగ్రామం..
కత్తి మీద సాము లాగ
సాగుతాయి జీవితాలు....
హద్దులు మీరక పోయిన
సరిహద్దులే సంకటమై..
నిద్దురలోన బ్రతుకులు
నింగి కెగసిపోవునులే.

-మేడిశెట్టి యోగేశ్వరరావు
మచిలీపట్నం

సరిహద్దు

సరిహద్దు ప్రజల బ్రతుకుల్లో
ప్రతి రోజూ యుద్ధాలే.
రైల్వే ట్రాక్ పక్కన
నివసించే వారికి
రైళ్ల శబ్దాలు ఎలానో
ఫిరంగుల మోతలు
వీరికి జీవితాల్లో భాగమే.
పుట్టిన నేలను వదిలి పోలేక
'భయంలో' బ్రతకడం
'భయంతో' బ్రతకడం
'భయపడుతూ' బ్రతకడం
అలవాటు చేసుకున్నారు.
పిల్లలు స్కూళ్లకు పరుగెడుతూ
ఉంటే ఒక్కొక్కసారి
బడి గంట బదులు,
సైరన్లు మోగుతాయి.
పెళ్లి మంటపంలో మోగే
బాజాల బదులు
బాంబుల మోతలు
బాణాసంచా బదులుగా
రాకెట్లు పేలుతుంటాయి.
వ్యవసాయ యుద్ధ భూముల్లో
ఆకలి పోరాటాలు చేయడంకోసం
వెళ్ళే
వీర కిసానులు అమరులై
తిరిగి వస్తారు.
భూదేవి వేదనతో అనుకుంటున్నది
ఎవరికోసం ఎలాంటి హద్దులను
భూమి మీద
నేను గీయలేదు కదా.
సృష్టి కర్త ఖిన్నుడై అనుకుంటున్నాడు
'అన్ని జీవులవలె మనుషుల్లోనూ
ఆడ మగ తప్ప ఇంకే భేదాలు
నేను సృష్టించ లేదు కదా' అని
కానీ మనిషి మాత్రం ద్వేషాలతో
పుడమి పై కనిపించని రేఖలను
సరిహద్దులుగా చేసుకుని
యుద్ధాలు చేస్తున్నాడు.

-శ్రీనివాస శాస్త్రి

సరిహద్దు జీవితాలు

కంచెను
ఒక్కసారి దులిపి చూడు
ఎన్నో వేదనలు
మరెన్నో రోదనలు
మౌనం పెన వేసుకున్న
ఎన్నో కన్నీటి గాథలు రాలి పడుతుంటాయి
మనసుపెట్టి చూడాలే కానీ
అవి మనసుని మెలిపెడుతుంటాయి.
సరిహద్దుల్లో
యుద్ధ మేఘాలు కమ్ముకున్నప్పుడల్లా
అక్కడి ప్రజలు గుండెల్లో
సైరన్ మోత మోగుతూనే ఉంటుంది
ఎన్నో ఏళ్లుగా వారు
పెంచి పోషించుకున్న కలలు
క్షిపణుల ధాటికి మాడి మసైపోతాయి
వారు కట్టుకున్న ఆశల సౌధాలు
డ్రోన్ల విధ్వంస రచనకు బలైపోతాయి
అప్పులనే ఎరువుగా చేసి పెంచిన పచ్చని పైరు
యుద్ధానికి మద్దతునిస్తూ
ఉన్నపలంగా నేలమట్టం అయిపోతుంది
ఎంతైనా..
సరిహద్దుతో ముడి వేసుకున్న జీవితాలు వారివి.
అరకొర బ్రతుకులతో
భద్రతా సమస్యల మధ్య
జీవితాలు నలిగిపోతున్నా ..
పోరు సాగినప్పుడల్లాజీవితాలు తలకిందులైపో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1505వ రోజు 'మిమిక్రీ' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'మిమిక్రీ' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సవ మూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839

మిమిక్రీ కళాకారులు

నోటితో శబ్దం
అనుకరణలకు పట్టం
విందుల్లో వినోదం
అందరి మన్నన లభ్యం.
వీరూ వారనే తేడా లేదు
అందరి ధ్వనుల అనుకరణ
నవ్వుల పువ్వులు పూయిస్తారు
పశు పక్షుల్లా అరుపులు
ఆశ్చర్యంలో ముంచేస్తారు.
గాలి లాగా ఊళలు
వాన చినుకుల సవ్వడి
సముద్ర అలల సందడి
అందరి నోళ్ళే తెరిపిస్తారు.
ఆకాశంలో ఉరిమే ఉరుము
గలగల పారే నదుల తీరు
గుర్రం నడిచే డెక్కల చప్పుడు
పట్టాలపై పరిగెత్తే రైలు కూత
ఇట్టే శ్రోతల చెవులలో మోగిస్తారు.
వీరేనండి మిమిక్రి కళాకారులు
దేశవిదేశాలు తిరిగేస్తారు
రికార్డులెన్నో చేసేస్తారు
బహుమతులెన్నో పొందేస్తారు.

-సావిత్రి రంజోల్కర్

జీవితమే ఒక మిమిక్రీ

ఏది కాదో దాన్ని
అదే అనిపించే
మిథ్యాభ్రమల భ్రమణం
అనుకరణానుసరణల మిశ్రమం
నలుగురిలో రంజనం
వినోదపంపిణీ ఉత్తమ కళ మిమిక్రీ.
తోడుకోరే కోకిలమ్మ
వసంత ఉదయాన
పదేపదే కుహూ పిలుపులతో
మనం కుహూ మని కోకిలలా అరిచిన
కోకిలమ్మ తోడు రానున్నదనే భ్రమలతో
మరింత జోరుగా
కుహూ శబ్దాలతో
ఆ ఉద్యానవనాలలో ప్రతిధ్వని.
మిమిక్రీ గొప్ప కళ
ఆత్మలను సంధించే
పరకాయ ప్రవేశాల ప్రదర్శన
క్లిష్ట కష్టతర సాధనల ఉత్పత్తి
మిమిక్రీకి ముందుగా
అనుకరణ విషయాన్ని
అభిమానించి ఆదరించు
విశ్లేషణతో
సదుద్దేశ్యంతో అనుకరించు.
మిమిక్రీవినోదమే కాక
ఉత్తమోన్నత నిగూఢ మూలాలను
వెలికితీయగల సాధనం.
మిమిక్రీ కళాకారులు
ఈ సాధనలో
స్వంత క్షేమాలను త్యజించి
నలుగురినీ రంజింపజేసే
త్యాగధనులు.

-రాజప్ప

వేణు మాధవ్

వేణుమాధవుడి యశస్సు విశ్వమంతా
తెలంగాణ మణిమాణిక్యమతడు
ఉపాధ్యాయ వృత్తికి
తరగని వన్నె అతడు
హద్దులు లేని ధ్వన్యనుకరణ అతనిది
తిరగులేని ప్రతిభ అనుకరణ
ఏకలవ్య శిష్యులెందరో కళారంగాన
ఓరుగల్లు తోటలో విరిసిన నవసుమం
చిత్రరంగ చిత్రవిచిత్రాలో.
కృత్రిమ మేధతోనూ అనుకరణ
మనుషులను మరిపించే అనుకరణ
పశుపక్షాదుల అనుకరణ
స్వరాల సంకలనం ధ్వన్యనుకరణం
మనసులు మైమరిచే అనుకరణం
చిన్నాపెద్దా బేధం లేకుండా ఆనందం.

- లక్ష్మారెడ్డి పసుల

ధ్వన్యనుకరణ

మనుషుల మాటలను
పక్షుల జంతువుల ధ్వనులను
అనుకరించడమే మిమిక్రీ
అనుకరణగా గుర్తుపట్టలేనంతగా
అసలుకు నకిలీ లీలలు
ప్రజల వినోదానికి
మిమిక్రీ ప్రోగ్రాములు
అరువది నాలుగు కళలలో
మిమిక్రీ ప్రత్యేకం
తెలుగు వాడైన నేరెళ్ల వేణుమాధవ్
ప్రపంచ ఖ్యాతి గడించడమే ప్రస్తుతం
ఆయన జాడల్లో ఎందరో
అందరినీ మెప్పించే పనిలో.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

అపురూప కళ

మిమిక్రీ ఒక అపురూప కళ
అంటారు ధ్వన్యనుకరణ
దీనిలో ఎందరో మహానుభావులు
ఈ కళాకారులు పలికించే
ధ్వనులు, స్వరాలు.
నేతల మాటతీరు
హావభావాలు
నటులు ఒక్కొక్కరి భిన్న స్వరం
పక్షుల రకరకాల అరుపులు
జంతువుల గర్జింపులు
రైలు పరుగెత్తే శబ్దాలు
మేఘ గర్జనలు
ఉరుములు
విమానం పైకి లేచే శబ్దం
విమానం కిందికి దిగే ధ్వని
తుపాకీ ధ్వని అనుకరణ.
మిమిక్రీతో
హంతకులను
నేరగాళ్ళను పట్టొచ్చు.
చనిపోయిన తల్లి కోసం
ఏడ్చే పిల్లలకు
ఆ గొంతు ఒక ఓదార్పు
ఎన్నో లాభాల మిమిక్రీ
సమాజానికి పనికొచ్చే విద్య.

-కోలా సత్యనారాయణ

పరకాయ ప్రవేశం

అదో అద్భుత కళ
ప్రేక్షకులను మైమరిపించి
మరోలోకంలోకి తీసుకెళ్లి
నవ్వులు పువ్వులు కురిపించి
మరో వ్యక్తి లోకి
పరకాయ ప్రవేశం
గొంతే కాదు
హావభావాలతో
మరో లోకం లోకి
పేరున్న కళాకారుల
జాబితాలో ఎందరో
చతుష్షష్టి కళల్లో
అద్భుతమైన కళ
ధ్వన్యనుకరణ.

-ఉమాశేషారావు వైద్య

పేరే నేరెళ్ళ

అనుకరణల కోయిలమ్మ
కుహూ కుహూ అంటే
కొమ్మల్లోని ఆకతాయి
అల్లరి పిడుగులు
కుహూ కుహూ అని గొంతు ఇచ్చారు!.
అందమైన అనుకరణ
ఆనంద కారణం
పెంచుతుంది అభినివేశం
అటువంటి శక్తియుక్తుల
మహామనీషి నేరెళ్ల వారు
ఆయన కంఠంలో పలికే శబ్దాలు
తెలుపుతాయి తాళగతులు
వివరిస్తాయి అర్థాలు
గొంతులో పలికించిన
మెకన్నాస్ గోల్డ్
పులకించిన సమస్త పృథ్వి.
పురుషోత్తముడు
మనసున్న వాడు
మహాకళాకారుడు
ఎందరికో మార్గదర్శి
భానుమతి పాటనుండి
బామ్మ పాట కూడా
అన్ని రకాల కళారూపాలు
చిటికెలో అందించే
మహాశక్తి కలిగిన నేరెళ్ళ వేణుమాధవ్
మిమిక్రీ ప్రపంచంలో శాశ్వతం!.

-కె.కె.తాయారు

ధ్వని అనుకరణ

అనుకరణ కళ మిమిక్రి
ధ్వని అనుకరణకే పేరు తెచ్చిన
నేరెళ్ల వేణుమాధవుడు
నేటి మిమిక్రి కళాకారులందరికి
గురుతుల్యుడు
మూడు డాక్టరేట్ల యోధుడు.
ఒక మనిషి అనేక మందిననుకరించడం
మిమిక్రి కళాకారుడి గొప్పదనం
అశేష జనానికి పంచుతుందది
అంతులేని అమితానందం
చెప్పలేని వినోదం.
గొంతులు మార్చే ప్రక్రియ
సాధనతోనే సాధ్యం
సరైన శిక్షణ తోడైతే
కఠోర అభ్యాసం చేయగలిగితే
ఆకాశమే ఇక దానికి హద్దు.
ధ్వని అనుకరణకు భాష అడ్డం కాదు
ఆడ మగ బేధమసలే లేదు
సంగీత సాహిత్య
భాషాసంస్కృతులపై పట్టు
మిమిక్రి కళకు అదనపు లక్కు.

-జె.వి.కుమార్ చేపూరి

నిలువెల్లా మిమిక్రీ!

మహా విద్వత్సంపన్నుడు
మన నేరెళ్ళ
గురువెవరూ లేని ఏకలవ్యుడు
నరనరాన అనుకరణ
మనకందించిన మహనీయుడు.
రైలుకూతనుంచి ఎక్స్ప్రెస్ కు
స్టేషన్ కు ఎక్స్ ప్రెస్ రాక వరకు
పారాహుషార్ అంటూ
చెప్పిన అనుకరణ విద్వత్తు
నిలువెల్లా కళ ఆవహించిన
కళాకారుడు.
అనుకరణ రంగ పితామహుడు
తరతరాలకు దారి దీపం
అందుకోండి మా జోతలు
వేలవేల అనుకరణ ప్రజోతలు.

-ప్రశాంతి రేవూరి

శబ్ద బ్రహ్మ

ఈ చప్పుడు మాదేనేమో అని
గుర్రాల తడబాటు
పక్షుల హైరానా
పరుగెత్తే రైళ్లు సైతం
గడబిడ
ఆ ప్రతిభను జూసి ప్రపంచం
మంత్ర ముగ్ధ
అనితర సాధ్యం ఆ ప్రతిభ
ఆ ధ్వన్యనుకరణ సామ్రాట్
నేటి కృత్రిమ 'మేధ'వుడే
నాటి నేరెళ్ల వేణుమాధవుడు
ఆ శబ్ద బ్రహ్మను చూసి
శబ్దానికే గర్వం
తెలుగు నేల రుణగ్రస్తం.

- కనపర్తి లక్ష్మయ్య

విలువలతో కూడిన విపంచి

సమాజంలో అంతరించిపోతున్న విలువలను పెంపొందింపజేసి, ఆరోగ్యకరమైన ఉత్తమమైన సమాజ నిర్మాణానికి విపంచి గేయ సంపుటి లోని పాటలు దోహదపడతాయని ,విలువలతో కూడిన విపంచిలోని గేయాలు సరళంగా ఉండి ఎవరైనా పాడుకునే విధంగా ఉన్నాయని ప్రముఖ రచయిత, సంచిక వెబ్ పత్రిక సంపాదకులు కస్తూరి మురళీకృష్ణ అన్నారు.ఆదివారం రోజున కరీంనగర్ లోని వాగేశ్వరీ డిగ్రీ పీజీ కళాశాలలో భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై కవి నగునూరి రాజన్న వెలువరించిన విపంచి గేయ సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటల రచనకు వయసుతో సంబంధం లేదని,కవి భావాల ప్రతిస్పందనలే కవితలు పాటలుగా రూపొందుతాయని అన్నారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న కవి సేనాధిపతి మాట్లాడుతూ విపంచి గేయ సంపుటిలో బాలగేయాలు, భక్తి గేయాలు,వర్యావరణ,చైతన్య, అభ్యుదయ,జానవద,లలిత గేయాలతోపాటు కార్మిక గేయాలు కూడా చోటు చేసుకున్నాయని, ఇందులో లేని గేయాలంటూ ఏవీ లేవని తెలిపారు.గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి ఇన్కమ్ టాక్స్ కన్సల్టెంట్ వేములవాడ ద్రోణాచారి మాట్లాడుతూ విశ్రాంత దశలో కూడా చక్కని విలువలతో కూడిన గేయ సంపుటిని వెలువరించిన నగునూరి రాజన్నను అభినందించారు.

మరొక గౌరవ అతిథి ప్రముఖ విమర్శకులు సీనియర్ జర్నలిస్టు కోవెల సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాజన్న రచించిన గేయాల్లోని తాత్వికతను అర్థం చేసుకోవాలని, సాహిత్యంతో పాటు పాటల్లో అంతర్లీనంగా దాగిఉన్న అంశాలను పట్టుకోవాలని అన్నారు.

ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ప్రముఖ సంగీత దర్శకులు కె.బి శర్మ విపంచి గేయ సంపుటిలోని పాటలను తమ మధుర స్వరంతో వినిపించి ఆహుతులను ఆహ్లాదపరిచారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బొమ్మకంటి కిషన్ ఆహ్వానించగా ప్రముఖ విమర్శకులు, విశ్రాంత ప్రధానాచార్యులు అన్నాడి గజేందర్ రెడ్డి పుస్తకాన్ని సమీక్షించారు. నగునూరి రాజన్న, ధనలక్ష్మి దంపతులు తమ విపంచి పుస్తకాన్ని మనమరాళ్లు చిరంజీవి అక్షర,ఆర్ణలకు కానుకగా అందించారు.

ఈ కార్యక్రమంలో దామరకుంట శంకరయ్య, యోగ సంపత్కుమారాచార్య, జితేందర్ కాసనగొట్టు స్వప్న ,సి.హెచ్ఎ.రజిత,ఎలగొండ రవి ,గూడెపు కుమార్,ఏడెల్లి రాములు, మేడి చంద్రయ్య,వెల్ముల జయపాల్ రెడ్డి, మానుపాటి రాజన్న,గుండు రమణయ్య , యన్.రాజయ్య,కసిరెడ్డి జలంధర్ రెడ్డి ,రాము ఇటిక్యాల్ మిట్టపల్లి శ్రీనివాస్, రాపర్తి వెంకటేశ్వర్లు , సింగిరెడ్డి రాజిరెడ్డి,శశి కిరణ్మయి,తిరుకోవెల వెంకటరమణ, గూడూరు మల్లారెడ్డి ఆర్. శ్యాంసుందర్, కవి రాజన్న బంధుమిత్రులు పాల్గొన్నారు.

సుద్దాల అశోక్‌తేజకు డా॥సినారె పురస్కారం ప్రదానం

సుద్దాల అశోక్‌తేజను సత్కరిస్తున్న అతిథులు.

ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు డా॥ సినారె పురస్కారాన్ని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో డా॥సి. నారాయణరెడ్డి జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డా॥ జె. చెన్నయ్య, నిర్వహణ సంస్థ అధ్యక్షుడు ఎం.కె.రాము, వ్యాఖ్యాత్రి ఎంకెఆర్ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై కవితల అస్త్రం

సత్కార గ్రహితలతో అతిథులు

అవినీతి అనేది సర్వత్రా వ్యాపించిందని, దానిపై కవులు కవితల అస్త్రాన్ని ప్రయోగించాల్సిన అవసరం ఉందని డా॥వంశీ రామరాజు ఉద్బోధించారు. గత మంగళ వారం రాత్రి హైదరాబాద్ మోహన్ నగర్ కొసరాజు ఆర్టి & జాహ్నవి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో సాహితీకిరణం సదరు ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన 'అంతా అవినీతిమయం-అంతం చేయాలి మనమిక' అనే అంశంపై నిర్వహించిన కవిసమ్మేళనానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, వారు ప్రసంగించారు. ఈ రోజుల్లో చిన్నపిల్లల్ని ఏదైనా మాట అంటే వారు ఎదురు తిరుగుతున్నారనీ, అటువంటప్పుడు అవినీతిపరులను మనం గట్టిగా అనలేని పరిస్థితి ఉన్నదికావున కవులే తమ కవితలద్వారా ఈ అంశాన్ని ప్రజలమధ్యకి తీసుకెళ్ళాలని వారు కోరారు. ఈ కవిసమ్మేళనం ప్రారంభకులుగా తొలుత కవిత చదివిన సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు నేడు విజృంభిస్తున్న కార్పోరేట్ శక్తులు దేశాన్ని ఏ విధంగా అవినీతిమయం చేసాయనేది తన కవిత 'ఋతువులేని క్రతువు'లో తెలియజేశారు. పెద్దూరి వెంకటదాసు నిర్వహించిన ఈ కవిసమ్మేళనంలో ఇంకా పొత్తూరి జయలక్ష్మి, తంగిరాల చక్రవర్తి, జొన్నలగడ్డ శ్యామల, ఎన్వీ రఘువీరప్రతాప్,యం.అరుణకుమారి, పరిమి వెంకటసత్యమూర్తి, మల్లాది విజయలక్ష్మి, డా॥పి.అంజన్‌కుమార్, తుమ్మ జనార్ధన్, గూడూరు విజయలక్ష్మి, ఆచంట సుధాకర్, గడ్డం సులోచన, తదితరులు చదవి వినిపించిన కవితలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొసరాజు సామ్రాజ్యం తాను ఈ కవిసమ్మేళనాన్ని ఏర్పాటు చేయటానికి గల కారణాలను వివరిస్తూ ఒక కవితను కూడా చదివి వినిపించారు. కార్యక్రమంలో కొసరాజు రాజేంద్రప్రసాద్ పొల్గొనగా మల్లాది వెంకటరమణ తన సహకారాన్నందించారు.

కొవ్వలి లక్ష్మీనరసింహారావు సేవలు మరువలేం

లక్ష్మీనరసింహారావుకు నివాళులర్పిస్తున్న దామోదర్ గుప్తా, కళా జనార్తనమూర్తి, జయసూర్య తదితరులు

ప్రజల్లో పరనాసక్తి పెంచేందుకు కృషి చేసిన సాహితీభీష్ముడు కొవ్వలి లక్ష్మీ నరసింహారావు అని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావులు శీర్షిక కార్యక్రమాల పరంపరలో భాగంగా సోమవారం కొవ్వలి లక్ష్మీ నరసింహారావు యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది.ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో వేయి పైగా రచనలు చేసిన వారు ఒక్క కొవ్వలి లక్ష్మీ నరసింహారావు మాత్రమేనన్నారు. తెలుగు సాహిత్య వ్యాప్తికి ఎంతో కృషి చేశారన్నారు. జర్నలిస్ట్ జయసూర్య, నిర్మాత తుమ్మపల్లి రామసత్యనారాయణ, గాయని సీత పాల్గొన్నారు.

కణిక

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

గురుభ్యోన్నమః

ముక్కోటి దేవతల సాక్షిగా
గురువే బ్రహ్మ, గురువే
విష్ణుః, గురుదేవో మహేశ్వరః
గురు సాక్షాత్ పరబ్రహ్మః
బుద్ధీ సిద్ధీ విద్యా సౌందర్యం.
భూత, వర్తమాన భవిష్యత్ కాలానికి
మార్గదర్శిగా.. త్రికాల జ్ఞాన విభూషణం
నిగమాగమ సంయుక్తం
అధ్యాయం అధ్యయనాలయ సందర్శనం.
అక్షర విజ్ఞానానికి ఆరంభం
గురువే విద్యార్జన సాన్నిధ్యం
మేధామథనం చిలికే కవ్వం
తిమిరాన్ని పారద్రోలే జ్యోతిర్మయం!
గురువే దైవం గురువే ధైర్యం
గురువే సంకల్పం వెలుగులు పంచే దీపం
అడుగుల నడకలు నేర్పే
శ్రద్ధా నివేదనం
క్రమశిక్షణా నిబద్ధతకు
మారుపేరుగా..
జ్ఞాన విజ్ఞాన భాండాగారం
ఇహ పర సాధనా కైంకర్యం
నమో! నమోస్తుతే!
నీవే జగతికి మూలం ధ్యానం
విశ్వ హిత ఆత్మవిశ్వాసం
అందించు
సుధామృత తాత్త్విక సందేశం
చింతనం,
మననంఆలోచనామృతం
మనసా వాచా కర్మేణా
శాసిత అనుశాసన బద్ధం
ప్రతిభా నైపుణ్యాలతో
వికసిత జీవిత సత్యం అందించే
సామర్థ్యం
మేల్కొలిపిన
దివ్యవాణి బోధిత రాజ్యం
నమామి!శరణం!
నీ పదపాదయుగ్మం!!.

-డా॥పద్మావతి.పి
హైదరాబాద్

అక్షర తోటకు వనమాలి

అక్షర కాంతులతో
చీకటి బతుకుల్లో వెలుగు నింప
జ్ఞాన జ్యోతితానై పసి మనసుల్లో
స్థిర నివాసమేర్పరచు కుంటాడు
అస్థిర సమాజాన్ని సుస్థిరముచేసి
తన కంటె ఉన్నతంగా నిలబెట్టే
త్యాగ జీవి గురువు.
గోవిందుని పరిచయంచేసి
గురు స్థానంలో పదిలంగా ఉంటు
ప్రత్యక్ష దేవుడై పూజలందుకుంటాడు
ప్రగతి రథాన్ని నడిపించే
రథసారథులను చేసి దేశ అభ్యుదయానికి
ఇంధనం నింపుతాడు గురువు.
విలువల విత్తులు జల్లి
విజయ శిఖరాలు ఎక్కే శక్తి నింపి
విశ్వ విజేతను చేసే వివేకుడు
సమతా భావాన్ని పెంచి
సౌభ్రాతృత్వాన్ని పంచే
సత్యమార్గాన్ని
చూపుతాడు గురువు.
ప్రకృతి అందాలను కాపాడే
సైనికులను చేసి పంచభూతాల
పరిరక్షణకు పహరాకాసే
ప్రశిక్షణనిచ్చి పచ్చదనమే
పసిడి సిరులంటు పరవశించే
మనషులను చేస్తాడు గురువు.

-డా.బి.సుధాకర్

గురు తత్వం

జ్ఞానదీపము జ్వలించునట్టి జనుల మధిలోని చీకటిని తొలగించువాడే గురువు, అక్షరమును కాక, ఆచరణమే ఆయన బోధన ? మౌనమే మహావాక్యం.
వాడలేని మాటలకు వేదాలు రూపం, నడకలోనే నిఖిలసారం చూపించే అనుభవ విద్యాస్వరూపం.
ఆయన చూపు తగిలిన చోట, వెలుగంతా నిండుతుంది. మాటలకన్నా దూరంగా, మనస్సుకు అర్థమయ్యే మార్గదర్శనం.
తన శ్వాసలే శాసనం, తన జీవితం ఒక నిరంతర ఉపనిషత్తు, ఆయన ఆశీర్వాదమే మన లోకానికి లోతైన కిరణం.
పౌర్ణమి వెలుగు చంద్రుని రూపంలో కాదు, గురువు హృదయంలోని ధ్యానదీపంలో వెలుగుతుంది. ఆ వెలుగు తాకిన మనసు, తానుగా మారుతుంది సత్య పథంలో సాగే నావగా.
కనుక గురుపౌర్ణిమ ఒక పండుగ కాదు, మన అంతరాత్మకు గురుతత్వాన్ని గుర్తు చేసే పవిత్ర సంధికాలం. ఆయన పాదసేవే పరమార్థం, ఆయన దయ చూపే దారి.. నిజమైన మోక్ష మార్గం.

-మొహమ్మద్ ఇస్మాయిల్
వనస్థలిపురం, హైద్రాబాద్.

సృష్టిలోన తరచిచూడ గురువు సూర్యసముడే
జ్ఞానకాంతి నందించును విద్యార్థుల కతడే.
జ్ఞానసాగరమతడు శిష్యులకు కల్పతరువు
ఓర్పుతోడ, నేర్పుతోడ విద్య నేర్పుతాడు మేరువు.
ఆదర్శాల వెన్నెలలను పంచు అందమైన జాబిల్లి
పిల్లల హృదిలో ఎన్నటికీ చెరిగిపోని రంగవల్లి.
దేవతల గురువు బృహస్పతి వలె
కృష్ణ పరమాత్మకు సాందీపని వలె.
ఉర్వీలోన గురువే నిక్కమైన దైవమతడు
తప్పులను సరి జేయు కన్నతల్లి సమమతడు.
నాన్నపోలె శిష్యులకు మంచి నడత పేర్పు నతడు
శిల్పిపోలె ఛాత్రులను శిల్పాలుగ మార్చునతడు.
విద్యా వీణా తంత్రులు మీటే సంగీత కారుడు
అక్షర రాగాల నాలపించు అపర గాయకుడు.
తెల్లని కాగితం పై సుందర చిత్రాలు గీయు చిత్రకారుడు
ఎల్ల వేళలందు విద్యా వర్షాన్ని కురిపించు జీమూతవాహనుడు.
విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చి దిద్దు బ్రహ్మయతడు
స్వార్థమెరుగని సంస్కారి, నిరంతర విద్యార్థి ఉపాధ్యాయుడు.

-వరలక్ష్మి యనమండ్ర

విభిన్న పుస్తకావిష్కరణలు

రథా సంపుటిని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్

తెలుగు సాహితీవనం సమూహం ఆధ్వర్యంలో తెలుగు సాహితీ వనం 8వ వార్షికోత్సవం సందర్భంగా విభిన్న పుస్తకావిష్కరణ, పురస్కారాల ప్రదానోత్సవాల కార్యక్రమం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు శాంతి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, డాక్టర్ అంపశయ్య నవీన్, పెద్దింటి అశోక్, ప్రత్యోధన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతికృష్ణ సంపాదకత్వంలో 25 మంది ఔత్సాహిక కవులు రచించిన 'విభిన్న' కథా సంపుటిని ఆవిష్కరించారు. తెలుగు సాహితీవనం నిర్వహించిన కవితా, కథా పోటీలలో విజేతలకు పురస్కారాలను ప్రదానం చేశారు.

మధ్యాహ్నం జరిగిన సభలో.. తెలుగు సాహితీవనం కవుల కవితల సంకలనం 'మిళిత'ను అడిషనల్ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి సీనియర్ జర్నలిస్ట్ సత్యాజీతో కలిసి ఆవిష్కరించారు. శీలా సుభద్రాదేవి, డాక్టర్ తంగెళ్ల శ్రీదేవి రెడ్డి, డాక్టర్ సంవత్‌కుమార్, కొల్లూరు సోమశంకర్, సమన్వయకర్తలుగా సుమనా ప్రణవ్, వెంకట్ వ్యవహరించారు.

మౌనశ్రీకి పల్లా జాతీయ కవితా పురస్కార ప్రదానం



మౌనశ్రీని సన్మానిస్తున్న అతిథులు

యువసాహితి ఆధ్వర్యంలో పల్లా జాతీయ కవితా పురస్కార ప్రధాన ఉత్సవ సభ కడప జిల్లా ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా జరిగింది. ప్రముఖ కవి, గీత రచయిత మౌనశ్రీ మల్లిక్ రచించిన మంటల స్నానం కవితా సంపుటికి ఈ గౌరవం దక్కింది. డాక్టర్ పల్లా కృష్ణ తన తండ్రి స్మృత్యర్థం గత ఎనిమిది సంవత్సరాలుగా ఈ పురస్కారాన్ని అందజేస్తున్నారు.

ఆదివారం ఉదయం ప్రసిద్ధ అనువాదకులు కొమ్మిశెట్టి మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా కొనిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి హాజరయ్యారు. శివచంద్రారెడ్డి మాట్లాడుతూ యువ రచయిత డాక్టర్ పల్లా కృష్ణ చేస్తున్న సాహిత్య సేవ స్ఫూర్తిదాయకం అన్నారు. మౌనశ్రీ మల్లిక్ ప్రతిభావంతమైన కవిత్వం రాస్తున్నారని, తన పాటల్లో కూడా చక్కటి సాహిత్యం వెల్లివిరుస్తుందని కొనియాడారు. గౌరవ అతిథి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ మౌనశ్రీ మల్లిక్ తో 25 ఏళ్ల అనుబంధం ఉందని, ఆయన సాహిత్యంలో ఎంతో ఎత్తుకు ఎదుగుతారని రెండు దశాబ్దాల క్రితమే ఊహించానని అన్నారు. ప్రత్యేక అతిథిగా వచ్చిన కవి, రచయిత, సాహితీ విమర్శకులు సివి సురేష్ మంటల స్నానం కవితా సంపుటిని క్లుప్త సుందరంగా సమీక్షించారు. మౌనశ్రీ కవిత్వం నిండా నవ్యాభివ్యక్తి కనిపించిందని, ప్రేమ, మానవతా, సామాజికత ఉందని అన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన సీనియర్ రచయిత దస్తగిరి మాట్లాడుతూ మౌనశ్రీ మల్లిక్ టీవీ సీరియల్స్ లోని పాటలను తాను చాలా విన్నానని అన్నారు. సభను విజయవంతం చేసిన ప్రొద్దుటూరు పట్టణ ప్రజలకు, తనను సాహిత్యంలో ప్రోత్సహిస్తున్న సాహితీ ప్రముఖులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పురస్కార గ్రహీత స్పందనలో భాగంగా మల్లిక్ మాట్లాడుతూ తనకు ఎన్నో పురస్కారాలు లభించినప్పటికీ ఈ పురస్కారం ఎప్పటికీ గుర్తుంటుందని అన్నారు. పల్లా కృష్ణ విద్యాధికుడు మాత్రమే కాదు, మంచి రచయిత, గొప్ప సంస్కారవంతుడని అన్నారు.

సభలో మహమ్మద్, రసూల్, కాశీవరపు వెంకటసుబ్బయ్య వంటి వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎరుక

అయిన వాళ్లెవరూ లేని
అందాల రాకుమారుడొకడు
ఆకాశం నుండి ఊడిపడి
ఆమాంతం చెయ్యందుకుని
నన్ను, నా వాళ్ళను అంటి పెట్టుకుని
అడిగినవి.. అడగనివి అమరుస్తూ
నా కొంగు విడువక తిరుగుతుంటే..
ఆహాఁహాఁ.. ఎంత బాగుంటుంది!
అసలే పని చెయ్యకుండానే
అల్లావుద్దీన్ అద్భుత దీపమొకటి
కాలికి తగిలి..
అంతులేని సంపదలు
అందాల భరిణే తో సరదాలు
ఆకాశాని కెత్తే అనుచరులు
తూ. చ. తప్పక
ఆజ్ఞ పాటించే సేవకులు
నాకే సొంతమైతే...
ఓహ్!
ఎంత అద్భుతంగా ఉంటుంది!
ఉట్టి కెగురే లేకున్నా..
స్వర్గాని కెగురాలానే
ఊహల పల్లకీ నుంచి దిగకుంటే..
కృషి లేకుండానే..
సంపద లొచ్చి చేరాలానే
గొంతెమ్మ కోర్కెల్ని వీడకుంటే...
ఎక్కడవేసిన పరిస్థితుల గొంగడి
అక్కడే ఉంటుందనే స్పృహ లేకుంటే..
కలల విహారపు దినచర్యతో
కాలమంతా కరిగాక
వగచినా.. ఒరిగేది సూన్యమనే ఎరుక
కలిగి వుండాలి యువత!

- షేక్ కాశింబి,
9052216044

ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం 2025 కై విమర్శా గ్రంథాలకు ఆహ్వానం

అరసం వరంగల్ వారు ప్రతి సంవత్సరం ఒక్కో సాహిత్య ప్రక్రియకు ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం చేయుట మీకు తెలిసిందే. 2025 సంవత్సరంకు గాను సాహిత్య విమర్శకు ప్రదానం చేయుటకు నిర్ణయించనైనది. కావున సాహిత్య విమర్శా గ్రంథాలను ఆహ్వానిస్తున్నాం .

నిబంధనలు : 1)2021జూలై నుండి 2025 జూన్ వరకు ప్రచురించినవై ఉండాలి. 2)మొదటి ముద్రణలు మాత్రమే పంపాలి. 3)న